ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in

ప్రజా కలం

Published From Nizamabad

PRGI No.TELTEL/2010/33275

PRAJA KALAM Telugu Daily తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
5 Lines Rs.250 only
&
Public Notice Advertising
క్లాసిఫైడ్స్ సంప్రదించండి
9010972526

ఆదివారం | 04-10- 2026 | సంపుటి: 17, సంచిక: 183, నిజామాబాద్, పేజీలు: 12, వెల: 3/- | ఎడిటర్: కలకొండ రామకృష్ణ

కామన్ పాస్‌తో

సులభ ప్రయాణం

మెట్రో, ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ప్రయాణికుల సౌకర్యమే లక్ష్యం.. మెట్రో-ఆర్టీసీ అనుసంధానానికి శ్రీకారం

ప్రయాణికుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్న ఉప ముఖ్యమంత్రి


హైదరాబాద్, అక్టోబరు 3 (ప్రజాకలం) :

హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. మెట్రో రైలు, టీజీఎస్ఆర్టీసీ బస్సు సేవలను అనుసంధానం చేస్తూ ప్రవేశపెట్టిన ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్ ద్వారా ప్రయాణికులకు ఒకే పాస్‌తో మరింత సులభంగా గమ్యస్థానాలకు చేరుకునే అవకాశం కల్పించింది. ఈ సౌకర్యం అమలు తీరును స్వయంగా పరిశీలించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క మెట్రో రైలు, ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వరకు భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గణేష్, నవీన్ యాదవ్, అధికారులు కామన్ పాస్‌తో మెట్రోలో ప్రయాణించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలువురు ప్రయాణికులతో నేరుగా మాట్లాడి కామన్ పాస్ వినియోగం ఎలా ఉంది? మెట్రో నుంచి బస్సుకు మారే సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా? ప్రయాణం సులభమైందా? వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు.

ప్రయాణికుల నుంచి సానుకూల స్పందన

కామన్ పాస్ తమకు ఎంతో ఉపయోగకరంగా ఉందని పలువురు ప్రయాణికులు భట్టికి తెలిపారు. మెట్రోలో ప్రయాణించిన అనంతరం గమ్యస్థానానికి చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల సమయం ఆదా అవుతోందని చెప్పారు.

తరువాయి 2వ పేజీలో...



పేదల ఇంటికే సంక్షేమం

కట్టుకాచారంలో రూ.6.65 కోట్ల చెక్‌డ్యామ్ ప్రారంభం

రూ.2.50 కోట్ల బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి

పాలేరు అక్టోబర్ 03(ప్రజా కలం న్యూస్)

ప్రజా ప్రభుత్వం పేదల ఇంటికే సంక్షేమాన్ని చేరవేస్తోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. శనివారం నేలకొండపల్లి మండలంలోని కట్టుకాచారం గ్రామంలో జిల్లా కలెక్టర్ దివాకర టీవీస్‌తో కలిసి మంత్రి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

కట్టుకాచారం గ్రామం వద్ద పాలేరు వాగుపై రూ.6.65 కోట్ల వ్యయంతో నిర్మించిన చెక్‌డ్యామ్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం కట్టుకాచారం పీపీవీ నుంచి బట్టుకుంటవాగు వరకు రూ.2.50 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. చెక్‌డ్యామ్ నిర్మాణం పూర్తవడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. చెక్‌డ్యామ్‌తో కట్టుకాచారం, కొత్తగూడెం, పరిసర గ్రామాల్లో భూగర్భ జలాలు పెరిగి రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. సుమారు 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం కలగడంతో పాటు గ్రామంలో నీటి లభ్యత మెరుగుపడుతుందని చెప్పారు. కట్టుకాచారం గ్రామంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన 35 నెలల్లో సుమారు రూ.13.50 కోట్లతో వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు మంత్రి తెలిపారు. రాయగూడెం నుంచి తక్కెళ్లపాడు వరకు బీటీ రోడ్డుకు రూ.3 కోట్లు, గ్రామ అంతర్గత రోడ్లకు రూ.52 లక్షలు, విద్యుత్ లైన్ల మార్పిడికి రూ.7.50 లక్షలు, తాగునీటి వసతులకు రూ.3.50 లక్షలు,

తరువాయి 2వ పేజీలో...

ఉపాధి లక్ష్యమే ఉన్నత విద్య

పరమార్థం కావాలి

ప్రతి విశ్వవిద్యాలయంలోనూ స్టార్టప్‌లు, ఆవిష్కరణల కోసం ఇంక్యుబేషన్ సెంటర్

డిగ్రీతో పాటే నైపుణ్యాల సాధన నూతన ప్రమాణం కావాలి

జేఎన్‌టీయూహెచ్‌లో వేడుకగా 'రీచ్-2026' సదస్సు : మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్, అక్టోబరు 3 (ప్రజాకలం) :

తరగతి గదికి, పరిశ్రమల అవసరాలకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూర్తిగా తగ్గించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యా సంస్థలకు పిలుపునిచ్చారు. విద్యా వ్యవస్థ యువతలో ఆలోచనా శక్తిని పెంపొందించడమే కాకుండా, వారిలో నైపుణ్యాలను అందించేలా వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలు చూపేలా సిద్ధం చేయాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీజీసీహెచ్ఈ) ఆధ్వర్యంలో శనివారం కుకట్‌పల్లిలోని జేఎన్‌టీయూహెచ్‌లో నిర్వహించిన 'రీచ్-2026' (రిసెర్చ్, ఎడ్యుకేషన్ అండ్ అడ్వాన్స్‌మెంట్) సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

తరువాయి 2వ పేజీలో...

తక్కువ నీటి తో పండే పంటల వైపు

రైతులు మళ్లాలి

రైతు నేస్తం 109వ ఎపిసోడ్‌లో రబీ విత్తన పంపిణీని

ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



హైదరాబాద్, అక్టోబరు 3 (ప్రజాకలం) :

ఎల్‌నినో ప్రభావంతో ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణ భారతదేశంలో, తెలంగాణలో నీటి కొరత పరిస్థితులు నెలకొన్నాయని, ప్రాజెక్టుల్లోకి తగినంత నీరు చేరలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో యాసంగిలో రైతులు స్వల్పకాలంలో పండే, తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో సాగయ్యే, మార్కెట్‌లో అధిక డిమాండ్ ఉన్న పప్పుధాన్యాలు, నూనె గింజల పంటల వైపు మళ్లాలని ఆయన సూచించారు. శనివారం (03.10.2026) ఉదయం ప్రసారమైన 'రైతు నేస్తం' కార్యక్రమం 109వ ఎపిసోడ్‌లో మంత్రి పాల్గొన్నారు. జాతీయ ఆహార భద్రతా మిషన్, జాతీయ నూనె గింజల మిషన్ పథకాల కింద రబీ 2026-27 సీజన్‌కు నూనె గింజలు, పప్పుధాన్యాల విత్తనాల పంపిణీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు.

లిమంత్రి ఆదేశాలు, సూచనలులి

- యాసంగిలో రైతులు తక్కువ కాలంలో, తక్కువ నీటితో, తక్కువ ఖర్చుతో సాగు చేయగల పంటలను వేసేలా వ్యవసాయ, అనుబంధ శాఖలు పూర్తి సమన్వయంతో వారిని సన్నద్ధం చేయాలి. క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులపై అవగాహన కల్పిస్తూ, పప్పుధాన్యాలు, నూనె గింజల సాగును ప్రోత్సహించాలి.
- ప్రాజెక్టుల్లో ఉన్న నీటి నిల్వల ఆధారంగా రైతుల పంటలను కాపాడేలా, నీటి పారుదల ప్రణాళికను జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో రూపొందించి, సక్రమంగా అమలు చేయాలి.
- క్షేత్రస్థాయిలో రైతుల అవసరాలు, మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వేరుశనగలో నూతన విత్తన రకాలను శాస్త్రవేత్తలు రూపొందించి, రైతుల ఆదాయం పెంపునకు తోడ్పడాలి.
- రైతులు తమకున్న సాగునీటి అవకాశాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల రైతుల కోరిక మేరకు ఇతర పంటలకు డ్రిప్లర్లను సబ్సిడీపై అందించేందుకు చర్యలు తీసుకుంటాం. ఆయిల్‌పామ్ గెలల కోత అనంతరం వాటిని వేగంగా ఫ్యాక్టరీకి తరలించేలా చర్యలు చేపడుతున్నాం.

తరువాయి 2వ పేజీలో...

బీఆర్ఎస్ బీసీ సభలో

తీవ్ర రసాభాస

గులాబీ నాయకుల రచ్చరచ్చ..

రణరంగంగా మారిన సమావేశం





పెద్దపల్లి,అక్టోబర్ 03:
(ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్ఆర్ గార్డెన్స్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి బీసీ సెల్ సమావేశం తీవ్ర వర్గపోరుతో రసాభాసగా మారింది. మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి నేతృత్వంలో శనివారం ఏర్పాటు చేసిన ఈ బీసీ ఆత్మీయ సదస్సులో నాయకులు,కార్యకర్తలు పరస్పరం దాడులకు దిగడంతో సమావేశ ప్రాంగణం ఒక్కసారిగా రణరంగంగా మారింది. నియోజకవర్గంలోని బీసీ సామాజిక వర్గానికి చెందిన కీలక నాయకులు గంట రాములు యాదవ్,దాసరి ఊషలతో పాటు పలువురు స్థానిక నాయకులను, క్రియాశీల కార్యకర్తలను ఈ సదస్సుకు

తరువాయి 2వ పేజీలో...

గద్వాల గడ్డపైకి తీన్మార్ మల్లన్న పాదయాత్ర

గద్వాల పట్టణంలోకి ప్రవేశించిన టీఆర్పీ వ్యవస్థాపకుడు..

ఎంఏఎల్‌డీ కళాశాల పిన్సిపల్‌తో మర్యాదపూర్వక భేటీ



గద్వాల ప్రతినిధి । అక్టోబర్ 3 । ప్రజా కలం : తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) వ్యవస్థాపకుడు తీన్మార్ మల్లన్న చేపట్టిన పాదయాత్ర జోగులాంబ గద్వాల జిల్లాలో కొనసాగుతోంది. ఆత్మకూరు మండల కేంద్రం నుంచి ప్రారంభమైన పాదయాత్ర గద్వాల మండలం కొత్తపల్లి మీదుగా గద్వాల పట్టణానికి చేరుకుంది. గద్వాల పట్టణంలోకి తీన్మార్ మల్లన్న ప్రవేశించడంతో పలువురు ప్రజలు ఆయనను కలసి అభినందించారు. అనంతరం గద్వాల కోటలోని ఎంఏఎల్‌డీ కళాశాలను సందర్శించిన తీన్మార్ మల్లన్న కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కలందర్ బాషా షేక్‌ను, అధ్యాపక బృందాన్ని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా గద్వాల ప్రాంత చరిత్ర, కోటకు సంబంధించిన విశేషాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. పాదయాత్ర సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి ప్రాంతంలోని పరిస్థితులను తెలుసుకుంటూ తీన్మార్ మల్లన్న ముందుకు సాగారు. టీఆర్పీ ఆధ్వర్యంలో తీన్మార్ మల్లన్న చేపట్టిన బీసీ రాజ్యాధికార యాత్ర రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న విషయం తెలిసిందే.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

- ప్రభుత్వ విప్ విజయ రమణారావు

- రూ. 1.15 కోట్లతో మహిళల పెట్రోల్ పంప్ ప్రారంభం



పెద్దపల్లి,అక్టోబర్ 03:(ప్రజాకలం జిల్లాప్రతినిధి)

మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి స్వావలంబన దిశగా తీసుకెళ్లడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు అన్నారు. శనివారం సుల్తానాబాద్ మండలం భూపతిపూర్ గ్రామంలో స్వశక్తి సంఘాల మహిళల ఆధ్వర్యంలో సుమారు రూ. 1.15 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన చైతన్య జ్యోతి పెట్రోల్ పంపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి ప్రభుత్వ విప్ శాసనసభ్యులు చింతకుంట విజయ రమణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ చింతకుంట విజయ రమణారావు మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. మహిళల ఆధ్వర్యంలో సోలార్ పవర్ ప్లాంట్లు, ఆర్టీసీ బస్సులు, పెట్రోల్ పంపులు ఏర్పాటు చేయడంతో పాటు చిన్న దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, స్మాల్ యూనిఫామ్‌ల కుట్టు కేంద్రాలు తదితర రంగాల్లో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. పెద్దపల్లి నుంచి స్వశక్తి సంఘాల మహిళల ఆధ్వర్యంలో 7 ఆర్టీసీ బస్సులు నడుస్తున్నాయని ప్రభుత్వ విప్ తెలిపారు. మహిళలు రైస్ మిల్లులు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించేందుకు కూడా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేలా

తరువాయి 2వ పేజీలో...

కామన్ పాస్‌తో సులభ ప్రయాణం

మొదటి పేజీ తరువాయి...

ప్రత్యేకంగా మరో టికెట్ తీసుకోవాల్సిన అవసరం లేకపోవడం సౌకర్యంగా ఉందన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత ఏ బస్సు ఎక్కాలి, ఏ మార్గంలో వెళ్లాలి అనే విషయంలో గతంలో ఎదురయ్యే అయోమయం కూడా తగ్గిందని ప్రయాణికులు వివరించారు. ప్రజా రవాణా వ్యవస్థలో మెట్రో–ఆర్టీసీ సేవలను అనుసంధానం చేయడం వల్ల రోజువారీ ప్రయాణికులకు ప్రయోజనం కలుగుతోందని పేర్కొన్నారు.

బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చట

జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి భట్టి విక్రమార్క సహచర మంత్రులతో కలిసి టీజీఎస్ఆర్టీసీ బస్సులో సెక్రటేరియట్ వరకు ప్రయాణించారు. బస్సులోనూ ప్రయాణికులతో ముచ్చటిస్తూ కామన్ పాస్ వినియోగం, ప్రయాణ సౌకర్యం, మెట్రో–బస్సు అనుసంధానంపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు.

ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరం: భట్టి

ఆర్టీసీ–మెట్రో కామన్ పాస్ విధానం ప్రయాణికులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒకే పాస్‌తో మెట్రో, ఆర్టీసీ బస్సులను సమన్వయంతో వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు గమ్యస్థానానికి చేరుకునే సమయంలో ఎదురయ్యే ఇబ్బందులు, అయోమయం తగ్గుతాయని తెలిపారు. మెట్రోలో ప్రయాణిస్తున్న మహిళలు, ఇతర ప్రయాణికులతో మాట్లాడగా కామన్ పాస్ విధానం సౌకర్యవంతంగా ఉందని వారు చెప్పారని భట్టి పేర్కొన్నారు. మెట్రో నుంచి దిగిన తర్వాత తమ ఇల్లు, కార్యాలయం లేదా ఇతర గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఆర్టీసీ బస్సు సేవలు అందుబాటులో ఉండటం వల్ల ప్రయాణం మరింత సులభతరం అవుతుందని అన్నారు. ప్రజా రవాణాలోని వివిధ మార్గాలను ఒకదానితో ఒకటి అనుసంధానం చేసి ప్రయాణికులకు 'సీమ్‌లెస్' ప్రయాణ అనుభూతి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని భట్టి తెలిపారు. ప్రస్తుతం మెట్రో–ఆర్టీసీ సేవలను అనుసంధానం చేశామని, భవిష్యత్తులో ఆటోలు, ఊబర్ వంటి ఇతర రవాణా సేవలను కూడా అనుసంధానం చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తోందని చెప్పారు. ప్రయాణికుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకుని కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు భట్టి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా రవాణాను బలోపేతం చేస్తాం: పొన్నం

హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థను మరింత సౌకర్యవంతంగా, సమర్థవంతంగా మార్చే లక్ష్యంతో ఆర్టీసీ––మెట్రో కామన్ పాస్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఒకే పాస్‌తో ఆర్టీసీ, మెట్రో సేవలను వినియోగించుకునే అవకాశం ఉండటంతో ప్రయాణికులకు సమయం, శ్రమతో పాటు ఖర్చు కూడా ఆదా అవుతుందని అన్నారు. నగరంలో పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యకు ప్రజా రవాణాను బలోపేతం చేయడం ముఖ్యమైన పరిష్కారమని పేర్కొన్నారు. ప్రజలను వ్యక్తిగత వాహనాల నుంచి ప్రజా రవాణా వైపు ఆకర్షించాలంటే ఆర్టీసీ, మెట్రో సేవలను సమన్వయంతో, సౌకర్యవంతంగా అందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు డైలీ పాస్, మంత్లీ పాస్‌తో పాటు కామన్ పాస్‌ను కూడా అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను పరిగణనలోకి తీసుకుని కామన్ పాస్ సేవలను మరింత మెరుగుపరుస్తామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రజలకు ఆర్థికంగా అందుబాటులో ఉండేలా మెరుగైన ప్రజా రవాణా సౌకర్యాలను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. హైదరాబాద్ భవిష్యత్తు అభివృద్ధి, ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల ప్రయాణ కష్టాలను తగ్గించడంలో ప్రజా రవాణా కీలక పాత్ర పోషిస్తుందని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, ప్రభుత్వ సలహాదారు (అర్బన్ ట్రాన్స్‌పోర్ట్–మెట్రో) ఎన్.వి.ఎస్.రెడ్డి, మెట్రో ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, మెట్రో అదనపు మేనేజింగ్ డైరెక్టర్ బి.అజిత్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ నీటి తో పండే పంటల వైపు రైతులు మళ్లాలి

మొదటి పేజీ తరువాయి...

రైతులకు చెల్లింపులు త్వరితగతిన జరిగేలా చూస్తాం.

కార్యక్రమ వివరాలు...వికారాబాద్, సంగారెడ్డి, సిద్దిపేట, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాలకు చెందిన రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వ్యవసాయ శాఖ సంచాలకులు డాక్టర్ బి. గోపి, ఐ.ఏ.ఎస్. కార్యక్రమ పరిచయం చేశారు. వ్యవసాయ ఉత్పత్తి కమిషనర్ మరియు వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ కె. సురేంద్ర మోహన్, ఐ.ఏ.ఎస్. 'రైతు నేస్తం' కార్యక్రమం ద్వారా రైతులను ఉద్దేశించి ప్రారంభ ఉపన్యాసం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎలక్ట్రానిక్ విభాగం, రైతు నేస్తం విభాగం రూపొందించిన వీడియోలను ప్రదర్శించారు. ఎల్‌నినో ప్రభావం, వాతావరణ మరియు వర్షపాత పరిస్థితులపై హైదరాబాద్‌లోని భారత వాతావరణ శాఖ శాస్త్రవేత్త–డి డాక్టర్ శ్రావణి వివరించారు. యాసంగిలో సాగుకు అనువైన పప్పుధాన్యాలు, నూనె గింజల పంటలపై రాజేంద్రనగర్‌లోని విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త సూచనలు ఇచ్చారు. అనంతరం రైతులు శాస్త్రవేత్తలతో ముఖాముఖి మాట్లాడి తమ సందేహాలు, సూచనలు తెలియజేశారు.

నూనె గింజల విత్తన పంపిణీ

దేశీయంగా నూనె గింజల ఉత్పత్తిని పెంచి, రైతుల ఆదాయాన్ని మెరుగుపరచడం ద్వారా వంట నూనెల దిగుమతులపై ఆధార పడటాన్ని తగ్గించి 'ఆత్మనిర్భరత' సాధించడం ఈ పథకం లక్ష్యం. 2026–27లో మొత్తం కేటాయింపు రూ. 49.35 కోట్లు. ఇందులో రూ. 34.55 కోట్లు రాష్ట్రానికి విడుదలయ్యాయి (కేంద్ర వాటా రూ. 21.33 కోట్లు, రాష్ట్ర వాటా రూ. 13.22 కోట్లు).

రబీలో వాల్యూ చైన్ క్లస్టర్లు, బ్లాక్ స్థాయి ప్రదర్శనా క్షేత్రాల కింద మొత్తం 29,375 క్వింటాళ్ల ధృవీకరించిన విత్తనాలను 52,425 ఎకరాల్లో రూ. 36.76 కోట్ల సబ్సిడీతో పంపిణీ చేస్తారు.

వాల్యూ చైన్ క్లస్టర్ల కింద 28,680 క్వింటాళ్ల విత్తనాలను 51,225 ఎకరాల్లో రూ. 36.32 కోట్ల ఆర్థిక సహాయంతో అందిస్తారు:

వేరుశనగ:28,260 క్వింటాళ్లు; 35,325 ఎకరాలు; రూ. 35.33 కోట్లు

కుసుమ:160 క్వింటాళ్లు; 4,000 ఎకరాలు; రూ. 16.80 లక్షలు

పొద్దుతిరుగుడు:లి 112.5 క్వింటాళ్లు; 4,500 ఎకరాలు; రూ. 53.32 లక్షలు

నువ్వులు: 148 క్వింటాళ్లు; 7,400 ఎకరాలు; రూ. 29.16 లక్షలు

పంపిణీ చేసే రకాలు: వేరుశనగలో గిర్నార్–4, గిర్నార్–5, కదిరి లేపాక్షి, TCGS 894; కుసుమలో ISF 764 (లక్ష్మీప్రియ); పొద్దుతిరుగుడులో తిల్హన్ టెక్ నాఖచీం–1, ఖదీూం 85; నువ్వులలో జీజూ 1020.

వాల్యూ చైన్ క్లస్టర్లు అమలయ్యే జిల్లాలు:

వేరుశనగ:మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, రంగారెడ్డి, వికారాబాద్, నల్గొండ, సిద్దిపేట

పొద్దుతిరుగుడు:లి సిద్దిపేట, కామారెడ్డి, రాజన్న సిరిసిల్ల

కుసుమ:రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి

నువ్వులు: ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల

వేరుశనగ, కుసుమ పంటల్లో 1,200 ఎకరాల్లో బ్లాక్ స్థాయి ప్రదర్శనా క్షేత్రాలను ఏర్పాటు చేస్తారు. ఇందుకోసం 694 క్వింటాళ్ల విత్తనాలను రూ. 43.97 లక్షల ఆర్థిక సహాయంతో పంపిణీ చేస్తారు. ఇవి కరీంనగర్, ఖమ్మం, హనుమకొండ, మహబూబాబాద్, వరంగల్, మెదక్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో ఉంటాయి.

పప్పుధాన్యాల విత్తన పంపిణీ

పప్పుధాన్యాల ఉత్పత్తిని, సాగు విస్తీర్ణాన్ని పెంచడం 'మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్'లక్ష్యం. 2026–27లో ఈ పథకానికి మొత్తం కేటాయింపు రూ. 34.60 కోట్లు.ఇందులో రూ. 24.21 కోట్లు రాష్ట్రానికి విడుదలయ్యాయి (కేంద్ర వాటా రూ. 14.59 కోట్లు, రాష్ట్ర వాటా రూ. 9.62 కోట్లు).

రబీలో ధృవీకరించిన విత్తనాల పంపిణీ, ప్రదర్శనా క్షేత్రాలు, విస్తీర్ణ విస్తరణ, మినీ కిట్ల కార్యక్రమాల ద్వారా రాష్ట్రంలోని 21 జిల్లాల్లో మొత్తం 29,008 క్వింటాళ్ల విత్తనాలను రూ. 15.25 కోట్ల ఆర్థిక సహాయంతో సబ్సిడీపై పంపిణీ చేస్తారు:

– శనగలు:లి 26,846 క్వింటాళ్లు; 83,053 ఎకరాలు; రకాలు NBeG-452 (5 ఏళ్లలోపు రకం), NBeG-47, NBeG-49 (5 ఏళ్లు పైబడిన రకాలు)

మినుములు:1,369.20 క్వింటాళ్లు; 16,958 ఎకరాలు; రకాలు VBN–8, VBN–10

పెసలు: 793 క్వింటాళ్లు; 9,801 ఎకరాలు; రకం MGG-385

విడుదలై 5 ఏళ్లలోపు, అలాగే 10 ఏళ్లలోపు ఉన్న రకాల విత్తనాల ప్రోత్సాహానికి ఈ పథకంలో ప్రాధాన్యం ఇస్తారు.

ఈ పథకాల కింద విత్తనాలను సబ్సిడీపై అందిస్తారు. విత్తన రకం, విత్తనం ధర, రకం మార్కెట్‌లోకి విడుదలైన కాలం, పథకం నిబంధనల ఆధారంగా 50 నుంచి 75 శాతం వరకు సబ్సిడీ లభిస్తుంది. కొన్ని రకాలకు 100 శాతం సబ్సిడీపై విత్తనాలు అందిస్తారు.

రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, విత్తనాల కోసం సమీప రైతు సేవా కేంద్రాలు లేదా మండల వ్యవసాయ అధికారులను సంప్రదించాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు

పేదల ఇంటికే సంక్షేమం

మొదటి పేజీ తరువాయి...

అంగన్‌వాడీ భవనం, ఇతర అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసినట్లు వివరించారు. ప్రస్తుతం ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో నీటి లభ్యతపై ప్రభావం పడుతోందని మంత్రి పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో చెక్‌డ్యామ్ నిర్మాణం రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు. భూగర్భ జలాలు పెరగడంతో పాటు సాగునీటి లభ్యత మెరుగుపడుతుందని తెలిపారు.

ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సన్నబియ్యం, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు తదితర సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని మంత్రి చెప్పారు. ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలను వారి ఇంటి వద్దకే అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలకు మద్దతు ఇచ్చే అర్హులైన కుటుంబాలకు కూడా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తెలిపారు.

మొదటి విడతలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయగా, ఇప్పటికే 2.25 లక్షల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని మంత్రి వివరించారు. మిగిలిన ఇళ్ల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. రెండో విడతలో సుమారు 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామని, హైదరాబాద్‌లో మరో లక్ష ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నామని చెప్పారు.

250 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ.. కట్టుకాచారం వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ ద్వారా సుమారు 250 ఎకరాల ఆయకట్టుకు సాగునీటి ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. చెక్‌డ్యామ్‌తో భూగర్భ జలాలు మెరుగుపడటంతో పాటు గ్రామంలో నీటి లభ్యత పెరుగుతుందని అన్నారు.

రూ. 6.65 కోట్ల వ్యయంతో చేపట్టిన చెక్‌డ్యామ్ నిర్మాణాన్ని కేవలం ఆరు నెలల్లోనే పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల్లో ఈ చెక్‌డ్యామ్ రైతులకు, గ్రామీణ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నేలకొండపల్లి మండలానికి చెందిన 31 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ వాసంతి, ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ యుగంధర్ రావు, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, స్థానిక సర్పంచ్ సైదులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి లక్ష్యమే ఉన్నత విద్య పరమార్ధం కావాలి

మొదటి పేజీ తరువాయి...

తరగతి గది నుంచి భవిష్యత్ కెరీర్ వైపు, విద్య నుంచి నైపుణ్యాల వైపు, పరిశోధన నుంచి పారిశ్రామిక రంగానికి నిరంతర అనుసంధానం ఉండాలని మంత్రి పేర్కొన్నారు. మన విద్యా వ్యవస్థ కేవలం డిగ్రీ సర్టిఫికెట్లు అందించే విధానం నుంచి, విద్యార్థులకు ఆచరణాత్మక నైపుణ్యాలు అందించే దిశగా మారాలన్నారు. కోర్సు పూర్తయిన వెంటనే విద్యార్థి ఉద్యోగానికి అర్హత సాధించాలని, పట్టా చేతికి వచ్చే సమయానికే ఆ స్థాయి సన్నద్ధత ఉండాలని పునరుద్ఘాటించారు.

విద్యార్థులు, పరిశోధకులు తమ ఆలోచనలను స్టార్టప్‌లుగా, నూతన ఉత్పత్తులుగా మలచడానికి వీలుగా ప్రతి విశ్వవిద్యాలయంలో ఇంక్యుబేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. కరికులమ్ రూపకల్పన, ల్యాబ్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ ప్రాజెక్టులు, పరిశోధనల్లో పరిశ్రమలు భాగస్వామ్యమవ్వాలని విజ్ఞప్తి చేశారు. "ఒక చేతిలో డిగ్రీ.. మరో చేతిలో నైపుణ్యం" ఉండటమే మన నూతన ప్రామాణికం కావాలన్నారు. టాటా టెక్నాలజీస్ భాగస్వామ్యంతో 65 ప్రభుత్వ ఐటీఐలను రోబోటిక్స్, ఆటోమేషన్, ఇండస్ట్రీ 4.0 వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన కేంద్రాలుగా (ఏటీసీ) తీర్చిదిద్దుతున్నామని వెల్లడించారు. 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ' ద్వారా సరికొత్త విద్యా, నైపుణ్య వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు.

'తెలంగాణ రైజింగ్ ఏ2047' లక్ష్యంతో ఉన్నత విద్యను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దడం, పరిశోధనల్లో ప్రతిభను పెంచడం, ఆవిష్కరణల వ్యవస్థను బలోపేతం చేయడంపై ఈ సదస్సులో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో సైయెంట్ వ్యవస్థాపక ఛైర్మన్ డాక్టర్ బి.వి.ఆర్. మోహన్ రెడ్డి, టీజీసీహెచ్ఈ ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకిష్టారెడ్డి, జేఎన్‌టీయూహెచ్ విసి ప్రొఫెసర్ టి. కిషన్ కుమార్ రెడ్డి, ఉస్మానియా వర్సిటీ విసి ప్రొఫెసర్ ఎం. కుమార్, ప్రొఫెసర్ పురుషోత్తంలతో పాటు వివిధ వర్సిటీల ఉపకులపతులు, 60కి పైగా ఉన్నత విద్యాసంస్థల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాలు, పరిశ్రమల మధ్య కుదిరే నూతన భాగస్వామ్యాలు, ఉమ్మడి పరిశోధనలు, స్టార్టప్‌లు, విద్యార్థులకు లభించే ఉపాధి అవకాశాల ప్రాతిపదికన మాత్రమే ఈ 'రీచ్' సదస్సు విజయాన్ని అంచనా వేయగలమని నిపుణులు అభిప్రాయపడ్డారు. విద్యార్హతలకు, పారిశ్రామిక అవసరాలకు ఉన్న వ్యత్యాసాన్ని కేవలం చర్చించడమే కాకుండా పూర్తిగా తుడిచిపెట్టేందుకు పరిశ్రమలు, విద్యాసంస్థలు చేయి చేయి కలపాలని మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.

గురుకులాల్లో విద్యా ప్రమాణాలతో పాటు మౌలిక వసతుల బలోపేతం

యూనిఫార్మ్‌లు, షూస్, పుస్తకాలు సకాలంలో అందాలి - శానిటేషన్, భద్రత, తాగునీరు, వంటశాలలపై ప్రత్యేక దృష్టి

క్వాలిటీ , క్వాంటిటీ కి ప్రాధాన్యత ఇవ్వాలి - ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక కార్యాచరణ

హైదరాబాద్, అక్టోబరు 3: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు అన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫార్మ్‌లు, షూస్, పుస్తకాలు తదితర వస్తువులు ఆలస్యం లేకుండా అందించాలని అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శనివారం గురుకులాలు, వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో గ్రావీఖ ద్వారా చేపడుతున్న కార్యక్రమాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి సభ్య సాచి ఘోష్, గిరిజన శాఖ కార్యదర్శి శ్రీమతి విజయేంద్ర బోయి ఉన్నతాధికారులతో ఈ సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర స్థాయి నుంచి జిల్లాలకు చేరిన యూనిఫార్మ్‌లు, షూస్, పుస్తకాలు తదితర సామగ్రిని విద్యార్థులకు వెంటనే అందించాలని మంత్రి సూచించారు. సరఫరా ఎక్కడ నిలిచిపోయింది.. ప్రొక్యూర్‌మెంట్‌లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. అనే అంశాలను గుర్తించి జిల్లా కలెక్టర్లతో సమన్వయం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రతి అంశానికి నిర్దిష్ట గడువు నిర్ణయించి, పురోగతిపై నివేదికలు తీసుకోవాలని సూచించారు. వందలాది మంది విద్యార్థులు ఉండే పెద్ద క్యాంపస్‌లలో ప్రస్తుత పారిశుద్ధ్య సిబ్బంది సరిపోతున్నారా అనే అంశాన్ని పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. అవసరమైన చోట్ల పారిశుద్ధ్య, స్కావెంజింగ్ సేవలను సమర్థంగా నిర్వహించేందుకు తగిన విధానం రూపొందించాలన్నారు. స్థానిక అవసరాలను బట్టి కాంటింజెన్సీ సిబ్బందిని వినియోగించడంతో పాటు, అవసరమైతే పారదర్శక ఆన్‌లైన్ టెండర్ విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రస్తుతము సిబ్బందికి అందిస్తున్న వేతనాలు చాలా తక్కువ ఉన్నాయి అని వాటిని పెంచేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి అధికారులు ఆదేశించారు. గురుకులాలను పూర్తి స్థాయిలో మరింత తీర్చిదిద్దేందుకు విద్యార్థుల సంఖ్య, స్థానిక అవసరాలకు అనుగుణంగా సమగ్ర మౌలిక వసతుల ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు. తరగతి గదులు, వంటశాలలు, తాగునీరు, ఆర్ఓ ప్లాంట్లు, వాషింగ్ సదుపాయాలు, శానిటేషన్, అవసరమైన పరికరాలను ఒకే ప్రణాళికలో చేర్చాలన్నారు. ఇప్పటికే అమలులో ఉన్న మంచి ఇంటిగ్రేటెడ్ బిల్డింగ్ నమూనాలను పరిశీలించి, అనువైన వాటిని ఇతర ప్రాంతాల్లోనూ అమలు చేసే అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట్ల భద్రతా సిబ్బంది, పోలీసు సమన్వయం, సీసీ కెమెరాల ఏర్పాటుపై సమగ్రంగా పరిశీలించాలని ఆదేశించారు. ముఖ్యంగా బాలికల గురుకుల విద్యాలయాల సంస్థల లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని స్థానిక పోలీస్ స్టేషన్ కు అనుసంధానం చేయాలని మంత్రి ఆదేశించారు. గురుకులాల్లో విద్యా ప్రమాణాల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి సూచించారు. బోధనా విధానంలో ఏకరూపత తీసుకురావడంతో పాటు గతంలో ఎదురైన బోధనా సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. మారుమూల ప్రాంతాల్లో సబ్జెక్టు నిపుణుల సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి ఆన్‌లైన్ తరగతులు, రిమోట్ అకడమిక్ సపోర్ట్, ఫౌండేషన్ కోర్సులను విస్తరించాలని సూచించారు. హైదరాబాద్‌లో అందుబాటులో ఉన్న సబ్జెక్టు నిపుణుల సేవలను జిల్లాల విద్యార్థులకు కూడా ఉపయోగపడేలా వర్చువల్ తరగతులు నిర్వహించాలన్నారు. ముఖ్యంగా ఇంటర్మీడియట్ విద్యార్థులకు పుస్తకాలు, స్టడీ మెటీరియల్, డిజిటల్ లెర్నింగ్ వనరులు, అదనపు కోచింగ్ అందించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. పోటీ పరీక్షలు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలపై విద్యార్థులకు మార్గదర్శనం కల్పించాలని సూచించారు. సాంక్షన్ అయిన పోస్టులు, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది, ఖాళీల వివరాలను సమగ్రంగా పరిశీలించాలని మంత్రి ఆదేశించారు. నియామకాల సమయంలో పోస్టుల మంజూరు, రోస్టర్, సీనియారిటీ, నియామక విధానం, ఆర్థిక శాఖ అనుమతులను పరిగణనలోకి తీసుకున్నారా అనే అంశాలను ధ్రువీకరించాలని సూచించారు. సంబంధిత వివరాలను గవర్నింగ్ బాడీ ముందుంచి అవసరమైన నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. గురుకులాలు, విద్యా సంస్థలకు సంబంధించిన భవనాల అద్దెలపై జీఎస్టీ వర్తింపు అంశాన్ని కూడా సమావేశంలో సమీక్షించారు.

మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

మొదటి పేజీ తరువాయి...

మరిన్ని ఉపాధి,వ్యాపార అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో స్వశక్తి సంఘాలకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని ప్రభుత్వ విప్ తెలిపారు.వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచామని చెప్పారు. పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 15,715 స్వశక్తి సంఘాలకు రూ.33.42 కోట్ల మేర రుణాలు అందించామని వివరించారు. మహిళా స్వశక్తి సంఘాల సభ్యులకు బీమా భరోసా కూడా కల్పిస్తున్నామని తెలిపారు.గతంలో సహజ మరణానికి రూ.30 వేల వరకు,ప్రమాద మరణానికి రూ.70 వేల వరకు బీమా సౌకర్యం ఉండేదని,అనంతరం ఈ పథకం నిలిచిపోయిందని చెప్పారు. ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం సహజ మరణం సంభవించిన మహిళలకు రూ.2 లక్షల రుణ బీమా, ప్రమాదవశాత్తు మరణించిన మహిళలకు రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తోందన్నారు.పెద్దపల్లి నియోజకవర్గంలో ఇప్పటివరకు 99 మంది మహిళలు సహజ మరణం చెందగా వారి కుటుంబాలకు రూ.75 లక్షల మేర రుణ బీమా ప్రయోజనం అందించామని, ఆరుగురు మహిళలు ప్రమాదవశాత్తు మరణించగా వారి కుటుంబాలకు రూ.60 లక్షల ప్రమాద బీమా అందించామని ప్రభుత్వ విప్ తెలిపారు.ప్రతి మహిళా సమావేశంలో ఈ వివరాలను తెలియజేసి,ప్రభుత్వం అందిస్తున్న ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు.ఐకేపీ కేంద్రాలను స్వశక్తి సంఘాల మహిళలు నిర్వహిస్తున్నారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని అన్నారు.రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యత అని,ఐకేపీ కేంద్రాల నిర్వహణలో ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పించాలని సూచించారు.ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సూపర్ ఎల్‌నినో పరిస్థితులు ఉన్నాయని, దీంతో నీటి లభ్యతపై ప్రభావం పడుతోందని ప్రభుత్వ విప్ తెలిపారు. పెద్దపల్లి జిల్లాలో మంచి వర్షపాతం నమోదైనప్పటికీ గత సంవత్సరాలతో పోలిస్తే ప్రస్తుతం నీటి లభ్యత తక్కువగా ఉందన్నారు. ఇతర జిల్లాల్లోని చిన్న చెరువుల్లో కూడా నీటి లభ్యత తక్కువగా ఉందని చెప్పారు.గత యాసంగిలోనే గ్రామాల్లోని చెరువులను నింపేందుకు ప్రభుత్వం నీటిని విడుదల చేసిందని తెలిపారు.ఈ యాసంగిలో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వరి సాగు చేయకుండా ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ సూచించారు.ఆయిల్‌పామ్, కూరగాయలు, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేసుకోవాలని కోరారు.వచ్చే సంవత్సరం సమృద్ధిగా వర్షాలు కురిస్తే వరి సాగు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత -జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష

గత మూడు సంవత్సరాలుగా ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. స్వశక్తి సంఘాల మహిళలకు రూ.10 లక్షల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించామని,జిల్లాలో ఇప్పటివరకు ఆరుగురు సభ్యులు ప్రమాదాల్లో మరణించగా వారి కుటుంబాలకు రూ.60 లక్షల బీమా అందించామని తెలిపారు.సహజ మరణం సంభవించిన మహిళలకు రూ.2 లక్షల రుణ బీమా సౌకర్యం కూడా అందుబాటులో ఉందన్నారు. మహిళలకు విహబ్, పెట్రోల్ పంపులు తదితర ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నామని తెలిపారు. మంథనిలో టైలరింగ్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, గత మూడు సంవత్సరాలుగా వడ్డీలేని రుణాల విధానాన్ని తిరిగి అమలు చేస్తున్నామని చెప్పారు.స్వశక్తి సంఘాల మహిళలకు సుమారు రూ.33 కోట్ల మేరకు వడ్డీ రాయితీ ప్రయోజనం అందించామని తెలిపారు.వడ్డీలేని రుణాల పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు పేర్కొన్నారు.మహిళలకు ఉపాధి అవకాశాలు పెంచేందుకు టాస్క్ ద్వారా ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు.గత మూడు సంవత్సరాల్లో సుమారు 3వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించగా,వారిలో సుమారు 60 శాతం మంది మహిళలేనని చెప్పారు.డిగ్రీ,పీజీ చదివిన మహిళలను గుర్తించి వారికి రుణాలు అందించడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లి ఉద్యోగం చేయలేని మహిళలకు జిల్లాలోనే వర్క్ ఫ్రమ్ హోమ్ అవకాశాలు కల్పించే దిశగా ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.ఒంటరి మహిళలకు ప్రత్యేకంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కలు,డ్రిప్ ఏర్పాటుకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందిస్తుండగా, మిగిలిన 10 శాతం వాటాను కూడా జిల్లా యంత్రాంగం భరించేలా చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు మరిన్ని కొత్త మార్గాలను సూచిస్తే వాటిని కూడా ప్రోత్సహించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా లైబ్రరీ చైర్మన్ అన్నయ్య గౌడ్, డీఆర్‌డీఓ కలిందిని,అడిషనల్ డీఆర్డీఓ రవీందర్,సర్పంచులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు,స్వశక్తి సంఘాల మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బీసీ సభలో

తీవ్ర రసాభాస

మొదటి పేజీ తరువాయి...

ఆహ్వానించలేదనే ఆరోపణలు వెల్లువెత్తాయి.కావాలనే తమను పక్కనబెట్టి అవమానించారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ బీసీ నేతలు,వారి మద్దతుదారులు సభ ప్రాంగణం వద్ద నిరసనకు దిగారు.ఈ క్రమంలో దాసరి మనోహర్ రెడ్డి వర్గానికి చెందిన నాయకులు ఆందోళనకారులను అడ్డుకోవడానికి ప్రయత్నించడంతో ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయి వాగ్వాదం ప్రారంభమైంది.మాటమాట పెరగడంతో సహనం కోల్పోయిన ఇరువర్గాలు సభ వేదిక ముందే భౌతిక దాడులకు దిగాయి. ఒకరినొకరు తోసేసుకుంటూ,గుద్దుకుంటూ తీవ్ర గందరగోళం సృష్టించారు.అనంతరం ఒకరిపైకొకరు కుర్చీలను విసురుకుంటూ దాడి చేసుకోవడంతో అక్కడ ఉన్న పలువురు భయాందోళనకు గురయ్యారు.ఈ ఘటనలో అనేక కుర్చీలు ధ్వంసమవ్వగా,ఆ ప్రాంతమంతా రక్తసిక్తమైన గొడవతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలకు నచ్చజెప్పి,గొడవను అదుపులోకి తీసుకొచ్చి నాయకులను అక్కడ నుంచి పంపించివేశారు.

మాజీ ఎమ్మెల్యే వైఖరిపై బీసీ నేతల ధ్వజం

సమావేశం అనంతరం అసంతృప్తి బీసీ నాయకులు మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి తీరుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.ఆయన అనుసరిస్తున్న ఒంటెద్దు పోకడలు,ఏకపక్ష నిర్ణయాల వల్లే పెద్దపల్లి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఉనికి కోల్పోయే ప్రమాదకర పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు.గత ఎన్నికల్లో ఓడిపోయినా ఆయన శైలిలో మార్పు రాలేదని,స్థానికంగా బీసీల అభిమానాన్ని,పార్టీ పునాదులను పూర్తిగా దెబ్బతీస్తున్నారని మండిపడ్డారు.తెలంగాణ వ్యాప్తంగా అన్ని రాజకీయ పార్టీలు బీసీ వాదాన్ని ఎలుగెత్తి చాటుతుంటే,పెద్దపల్లిలో మాత్రం సొంత పార్టీ నేతలే బీసీలను పదేపదే అవమానపరుస్తున్నారని,ఇలాగే కొనసాగితే పెద్దపల్లిలో బీఆర్ఎస్ కేడర్ మిగలదని హెచ్చరించారు.


అక్రమంగా నిల్వ ఉంచిన కలప పట్టివేత..



మల్లాపూర్, అక్టోబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండలంలోని కొత్త ధంరాజ్‌పల్లి గ్రామ పరిధిలో అక్రమంగా నిల్వ ఉంచిన టేకు కలపను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అటవీ అధికారులు తనిఖీలు నిర్వహించగా, మొత్తం 20 టేకు కలప దుంగలు పట్టుబడ్డాయి.మల్లాపూర్ సెక్షన్ అధికారి బి. గంగారం సమక్షంలో నిర్వహించిన తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న కలప విలువ సుమారు రూ. 35 వేలుగా అంచనా వేశారు. అక్రమంగా కలప నిల్వ చేసిన వ్యక్తులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు తెలిపారు.అటవీ సంపదకు నష్టం కలిగించేలా టేకు కలప నరికివేత, అక్రమ నిల్వ, రవాణా, స్మగ్లింగ్‌కు పాల్పడితే అటవీ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అటవీ నేరాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే శాఖ అధికారులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

గల్ఫ్ మృతుడి అంతిమయాత్రలో జువ్వాడి కృష్ణారావు

మల్లాపూర్, అక్టోబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి) గల్ఫ్ దేశమైన ఖతార్‌లో గత నెల 24న మృతి చెందిన మల్లాపూర్ మండలం నడికుడ గ్రామానికి చెందిన తలారి ముత్తన్న మృతదేహం శనివారం స్వగ్రామానికి చేరుకుంది. ముత్తన్న మృతదేహం స్వగ్రామానికి చేరుకోవడంతో నడికుడలో



విషాదఛాయలు అలుముకున్నాయి.ముత్తన్న మృతదేహాన్ని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ముత్తన్న అంతిమయాత్రలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాట్ల సోమయ్య, జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు జలపతి రెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ ముద్దం రాజేందర్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాదర్ స్వామి పరామర్శ..



బెల్లంపల్లి, అక్టోబర్ 3, (ప్రజాకలం) ప్రతినిధి.మంచిర్యాల జిల్లా,బెల్లంపల్లి మండలం కాంగ్రెస్ పార్టీ మాజీ మండల అధ్యక్షుడు సింగతి సత్యనారాయణ తండ్రి సింగతి మల్లయ్య మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మరణించారు.కాగా టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అయిన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు భాకం కొమురయ్య,వార్డ్ మెంబర్ బొలిశెట్టి సుధాకర్ , రామ్ టెంకి హరి కృష్ణ ,బాకం అంజయ్య, సింగతి అర్జయ్య ,అచ్చ సత్తయ్య ,చింతం స్వామి ,వార్డు మెంబర్ చిలుముల వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ వద్ద 6న బీజేపీ రణభేరి

మల్లాపూర్, అక్టోబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి)

మూసివేసిన షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామని హామీ ఇచ్చి రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 6న షుగర్ ఫ్యాక్టరీ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో రణభేరి బహిరంగ సభ నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాదగిరి బాబు తెలిపారు.ఈ మేరకు మల్లాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎంపీ అరవింద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ సభకు రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై బీజేపీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అనూప్ రావ్,మల్లాపూర్ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్ రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు ఇట్టెడి శేఖర్,జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మి,వేంపేల్లి సర్పంచ్ రాజేందర్,మండల ప్రధాన కార్యదర్శి కాంతయ్య, గజ్జి శ్రీను,చింతకుంట నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నిర్ణిత గడువులోగా పూర్తి చేయాలి

– పుష్కరాల ఘాట్ల నిర్మాణ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



జగిత్యాల: ప్రతినిధి అక్టోబర్ 3 (ప్రజాకలం)

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ధర్మపురి పట్టణంలో గోదావరి పుష్కరాల సందర్భంగా చేపడుతున్న ఘాట్ల నిర్మాణ పనులను అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ శనివారం సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఘాట్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన ఆయన, పుష్కరాల సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ తదితర ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ధర్మపురిలోని ఉగ్ర నరసింహస్వామి ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు, పారిశుధ్య ఏర్పాట్లు, పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన ఇతర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించారు. అనంతరం ధర్మపురి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు.డయాలసిస్ సేవలు, రోగులకు అందుతున్న వైద్య సదుపాయాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.ఆసుపత్రి సిబ్బందితో మాట్లాడి చికిత్స పొందుతున్న రోగుల వివరాలు, రోగుల జాబితా, ఓపీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా, రికార్డులను ఎప్పటికప్పుడు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. ఈ పరిశీలనలో మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, ధర్మపురి తహశీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీఓ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ నోటీసులు ప్రతి నోటీసుదారునికి

అందేలా చర్యలు తీసుకోవాలి



– జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల ప్రతినిధి అక్టోబర్ 3 (ప్రజాకలం)

మెట్ పెల్లి ఆర్డీవో కార్యాలయంలో ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శుక్రవారం సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా జారీ చేసిన నోటీసులు ప్రతి నోటీసుదారునికి తప్పనిసరిగా అందేలా బీఎల్‌వోలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. నోటీసుల పంపిణీలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రతి నోటీసుదారునికి సకాలంలో నోటీసులు అందేలా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. నోటీసులు అందించిన వివరాలను పక్కాగా నమోదు చేయడంతో పాటు, పంపిణీ ప్రక్రియను బాధ్యతాయుతంగా పూర్తి చేయాలని బీఎల్‌వోలకు స్పష్టం చేశారు.ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను వెంటనే సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రక్రియ మొత్తం పారదర్శకంగా, పకడ్బందీగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. నోటీసుల జారీ, పంపిణీ, స్వీకరణకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ప్రక్రియను సక్రమంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహారావు, కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి, మెట్ పెల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, సంబంధిత మండల తహసీల్దార్లు, బీఎల్‌వోలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించాలి

- ఎస్సీ బాలుర, బాలికల వసతి గృహాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



జగిత్యాల: ప్రతినిధి అక్టోబర్ 3 (ప్రజాకలం) జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని, మెట్పల్లి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో విద్యార్థులకు అందుతున్న వసతి, భోజనం, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాలను పరిశీలించి, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.వసతి గృహాల పరిసరాలను పరిశీలించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన తాగునీరు, సక్రమమైన పారిశుధ్య నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై వారితో నేరుగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా వసతి గృహాల్లో అదనంగా నిర్మిస్తున్న వంటశాల, గదుల నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నిర్మాణ పనులు ఏ దశలో ఉన్నాయో, ఇప్పటి వరకు ఎంత మేరకు పనులు పూర్తయ్యాయో, మిగిలిన పనులను ఎప్పటిలోగా పూర్తి చేయవచ్చో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు సమకూర్చడంతో పాటు, నిర్మాణంలో ఉన్న అదనపు సదుపాయాలను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ పరిశీలనలో మెట్ పెల్లి ఆర్డీవో నరసింహారావు, ఈఈ, పీఆర్ అధికారి లక్ష్మణరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారి జై రాజ్, మండల తహసీల్దార్‌తో పాటు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కర్ర పూజా మహోత్సవం

శరణ్ నవరాత్రి ఉత్సవాలకు ఎర్పాట్లు - గ్రామలలో భక్తుల ప్రత్యేక పూజలు



ఇబ్రహీంపట్నం అక్టోబర్ 03 (ప్రజా కలం ప్రతినిధి)

దేవి శరణ్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో శనివారం కర్ర (గద్దె) పూజా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేములకుర్తి, ఎర్రండి, గోదూర్, వర్షకొండ, డబ్బ, అమ్మక్కపేట, ఫకీర్‌కొండాపూర్, కేశాపూర్, బర్దిపూర్, మూలరాంపూర్, ఇబ్రహీంపట్నం తదితర గ్రామాల్లో అమ్మవారి గద్దెలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారికి కుంకుమార్చనలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని భక్తి గీతాలు ఆలపిస్తూ అమ్మవారిని ప్రార్థించారు. గ్రామాల్లో భక్తిమయ వాతావరణం నెలకొనగా, యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లను ఉత్సవ కమిటీ సభ్యులు శాలువాలతో సన్మానించారు. పండితులు అమ్మవారి మహిమను, శరణ్ నవరాత్రి ఉత్సవాల ఆధ్యాత్మిక విశిష్టతను భక్తులకు వివరించారు. నవరాత్రి పూజల ద్వారా గ్రామాల్లో సుఖశాంతులు, ఐశ్వర్యం, పంటల సమృద్ధి కలగాలని భక్తులు అమ్మవారిని వేడుకున్నారు. నవరాత్రి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ సభ్యులు, బజరంగ్ దళ్ యువసేన, గ్రామ పెద్దలు విశేషంగా కృషి చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈకార్యక్రమంలో కమిటీ ల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణకు

ఉద్యమ కార్యాచరణ



మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 3 (ప్రజా కలం) ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ పునరుద్ధరణే ధ్యేయంగా రాజకీయాలకు అతీతంగా ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తున్నట్లు కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు, తెలంగాణ రైతు ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సారెడ్డి తెలిపారు. శనివారం మెట్‌పల్లిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధితో పాటు మెట్‌పల్లి, కోరుట్ల, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్ మండలాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల, ప్రజాప్రతినిధుల, రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో పాలకుల విధానాల కారణంగా ముత్యంపేట నిజాం షుగర్ ఫ్యాక్టరీ మూతపడటంతో చెరుకు రైతులు, ఫ్యాక్టరీపై ఆధారపడిన కార్మిక కుటుంబాలు తీవ్రంగా నష్టపోయాయని పేర్కొన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీ పునరుద్ధరణకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.పునరుద్ధరణ ప్రక్రియలో జరుగుతున్న జాప్యాన్ని నివారించి పనులను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కోరుట్ల నియోజకవర్గ అభివృద్ధి సాధన సమితి ఆధ్వర్యంలో రాజకీయాలకు అతీతంగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందిస్తామని శేర్ నర్సారెడ్డి తెలిపారు.

పాషాను సన్మానించిన యువ నాయకులు



మెట్ పల్లి కోరుట్ల ప్రతినిధి అక్టోబర్ 3 (ప్రజాకలం) కాంగ్రెస్ పార్టీ జగిత్యాల జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మహమ్మద్ ఖుతుబోద్దీన్ పాషాను టీపీసీసీ డెలిగేట్ కల్వకుంట్ల సుజిత్ రావు నివాసంలో యువ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం పాషాను మర్యాదపూర్వకంగా కలిసిన యువ నాయకులు శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. పాషా భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి పార్టీతో పాటు ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యులు మహమ్మద్ ఖిజార్, మహమ్మద్ పైసల్, మహమ్మద్ జయాన్, మాలిక్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా వంశీధర్ రెడ్డి



మల్లాపూర్, అక్టోబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి) మల్లాపూర్ మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వంశీధర్ రెడ్డి ఎన్నికయ్యారు.ప్రధాన కార్యదర్శిగా అశోక్, కోశాధికారిగా హరీష్, ఉపాధ్యక్షుడిగా సురేష్, గౌరవ అధ్యక్షుడిగా మురళిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వంశీధర్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని, సంఘం ఐక్యతను కాపాడుతూ కార్యదర్శుల సంక్షేమం కోసం పనిచేస్తానని అన్నారు.

క్రీడలతో ఆత్మవిశ్వాసం క్రమశిక్షణ పెరుగుతాయి

– గాయత్రి కళాశాల చైర్మన్ శ్రీనివాస్

– రాష్ట్రస్థాయి ఖో ఖో పోటీలకు గాయత్రి కళాశాల విద్యార్థి ఎంపిక



పెద్దపల్లి,అక్టోబర్ 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) విద్యార్థుల్లో మానసిక స్థైర్యం,క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందడానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయి.చదువుతో పాటు క్రీడలకు కూడా విద్యార్థులు సమాన ప్రాధాన్యత ఇవ్వాలి.ఆటల ద్వారా లభించే జట్టు స్ఫూర్తి,క్రమశిక్షణ భవిష్యత్తులో ఎదురయ్యే ఎలాంటి సవాళ్లనైనా ధైర్యంగా ఎదుర్కొనేందుకు తోడ్పడతాయఅని గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ శ్రీనివాస్ పేర్కొన్నారు. పెద్దపల్లిలోని గాయత్రి జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థి అట్ల వినయ్ కుమార్ అండర్-17 విభాగంలో ఖో ఖో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వినయ్ కుమార్‌ను చైర్మన్ శ్రీనివాస్,కళాశాల ప్రిన్సిపల్ సురేష్ ప్రత్యేకంగా అభినందించి,శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 14న హైదరాబాద్ లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలలో వినయ్ కుమార్ పాల్గొననున్నట్లు తెలిపారు.రాష్ట్రస్థాయిలోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచి కళాశాలకు,జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొని వినయ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజా కలం
ఆదివారం, అక్టోబర్ 4, 2026

వాయు కాలుష్యంపై జాతీయ కార్యాచరణ అవసరం

దేశవ్యాప్తంగా పట్టణీకరణ వేగవంతమవుతున్న నేపథ్యంలో వాయు కాలుష్యం ప్రజారోగ్యానికి, పర్యావరణ పరిరక్షణకు ప్రధాన సవాలుగా మారుతోంది. పెరుగుతున్న వాహనాల సంఖ్య, పారిశ్రామిక ఉద్గారాలు, నిర్మాణ కార్యకలాపాల నుంచి వెలువడే ధూళి, వ్యర్థాల దహనం, పంట అవశేషాల కాల్చివేత వంటి కారణాలతో అనేక నగరాల్లో గాలి నాణ్యత ఆందోళనకర స్థాయికి చేరుతోంది. ఈ సమస్యను కాలానుగుణంగా మాత్రమే కాకుండా ఏడాది పొడవునా సమగ్రంగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. వాయు కాలుష్యంలో పీఎం2.5 సూక్ష్మకణాలు అత్యంత ఆందోళనకరమైనవి. మానవ వెంట్రుక మందంలో సుమారు ముప్పైవంతు పరిమాణంలో ఉండే ఈ కణాలు శ్వాసకోశంలోకి లోతుగా ప్రవేశించి ఊపిరితిత్తులు, గుండె, రక్తనాళాలు, ఇతర అవయవాలపై ప్రతికూల ప్రభావం చూపగలవు. దేశ జనాభాలో దాదాపు 140 కోట్ల మంది అనారోగ్యకర స్థాయిలో పీఎం2.5కు గురవుతున్నారని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. 2019లో వాయు కాలుష్యం కారణంగా అకాల మరణాలు, అనారోగ్యం, ఉత్పాదకత నష్టాల రూపంలో భారత ఆర్థిక వ్యవస్థకు 36.8 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. ఇది అప్పటి స్థూల దేశీయోత్పత్తిలో 1.36 శాతానికి సమానం. 2009–2019 మధ్య జాతీయ ప్రమాణాలను మించిన పీఎం2.5 కాలుష్యానికి గురికావడం వల్ల దేశంలో సుమారు 38 లక్షల మరణాలు సంభవించి ఉండవచ్చని అంతర్జాతీయ అధ్యయనం అంచనా వేసింది. వార్షిక పీఎం2.5 స్థాయిలో ప్రతి 10 మైక్రోగ్రాముల పెరుగుదలతో మొత్తం మరణాల ముప్పు 8.6 శాతం పెరిగినట్లు పరిశోధకులు పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో కొన్ని సానుకూల ఫలితాలు కూడా నమోదవుతున్నాయి. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం కింద 130 నగరాల్లో చర్యలు కొనసాగుతున్నాయి. 2025–26లో 108 నగరాల్లో 2017–18తో పోలిస్తే పీఎం10 స్థాయిలు తగ్గాయి. వీటిలో 72 నగరాల్లో 20 శాతానికి పైగా, 26 నగరాల్లో 40 శాతానికి పైగా తగ్గుదల నమోదైంది. అదే సమయంలో 2025–26లో ముంబయిలో పీఎం2.5 సగటు 33, హైదరాబాద్‌లో 34, పుణేలో 41, సూరత్‌లో 32, ఢిల్లీలో 102 మైక్రోగ్రాములుగా నమోదైంది. 2026 మార్చి నాటికి దేశవ్యాప్తంగా 603 నగరాల్లో 1,646 వాయు నాణ్యత పర్యవేక్షణ కేంద్రాలు పనిచేస్తున్నాయి. అయితే నగరాల సరిహద్దులకే కాలుష్య నియంత్రణను పరిమితం చేయడం సమర్థవంతమైన పరిష్కారం కాదు. గాలి ప్రవాహానికి పరిపాలనా సరిహద్దులు ఉండవు. అందువల్ల రాష్ట్రాలు, నగరాల మధ్య సమన్వయంతో మొత్తం వాయు పరివాహక ప్రాంతాన్ని ప్రాతిపదికగా చేసుకుని కార్యాచరణ రూపొందించాలి. వాహన ఉద్గారాల నియంత్రణ, ప్రజా రవాణా విస్తరణ, నిర్మాణ ప్రదేశాల్లో ధూళి నియంత్రణ, పారిశ్రామిక ఉద్గారాలపై కఠిన పర్యవేక్షణ, వ్యర్థాల బహిరంగ దహనానికి అడ్డుకట్ట, స్వచ్ఛ ఇంధన వినియోగం వంటి చర్యలు సమాంతరంగా అమలు కావాలి. పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయడంతో పాటు నిబంధనల అమలుపైనా నిరంతర సమీక్ష అవసరం. ఆర్థిక ప్రగతికి పరిశ్రమలు ఎంత అవసరమో.. ప్రజల ఆరోగ్యానికి స్వచ్ఛమైన గాలి అంతే అవసరం. అభివృద్ధి వేగంతో పాటు గాలి నాణ్యత మెరుగుదలకు సమాన ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఆరోగ్యకరమైన, సుస్థిరమైన భారత నిర్మాణం సాధ్యమవుతుంది.

- సి.హెచ్. ప్రతాప్

హిందూ దేవాలయాలం పై దాడి చేసిన
నిందితుడిని శిక్షించాలి
– బీజేపీ రాష్ట్ర నాయకుడు మర్రిపెల్లి సత్యం



వెల్గటూర్, అక్టోబర్ 3, ప్రజాకలం, ప్రతినిధి :

హైదరాబాద్ లోని దిల్ సుఖ్ నగర్ ప్రాంతంలో గల సంతోషిమాత ఆలయంలో ఆలయ పూజారి పూజ చేస్తున్న సమయంలో ఆలయంలోకి చొరబడి అమ్మవారి విగ్రహం పై కర్రతో దాడి చేసిన మహమ్మద్ అన్సారి అనే ముస్లిం వ్యక్తిని కఠినంగా శిక్షించాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మర్రిపెల్లి సత్యం అన్నారు. శనివారం వెల్గటూర్ లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడాడు. తెలంగాణలో కొందరు ముస్లిం వ్యక్తులు హిందూ దేవాలయాల పై వరుసగా దాడులు చేస్తూ హిందువుల మనో భావాలను దెబ్బతీస్తున్నారని అన్నారు హిందూ దేవాలయాల పై దాడి చేసి దేవతల విగ్రహాలను ధ్వంసం చేస్తున్న మతోన్మాదులను తెలంగాణ ప్రభుత్వం మతిస్థిమితం లేని పిచ్చివాళ్లుగా ముద్ర వేసి వదిలి పెడుతుందని విమర్శించారు. దుర్మార్గమైన చర్యలకు పూనుకుంటున్న వ్యక్తులకు సహకరించి, నిర్దోషులుగా బయటపడేందుకు సహకరిస్తుందని అన్నారు.

గతంలో బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ రెండు పార్టీల వారు వారికి సహకరిస్తూనే వస్తున్నారని అన్నారు. తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ఎంఐఎం నాయకుల మెప్పు కోసం హిందువులను హిందుగాల్లు, బొందుగాళ్లని శంభోధించారని గుర్తు చేశారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ అంటే ముస్లింల పార్టీ అని, ముస్లింలు అంటేనే కాంగ్రెస్ పార్టీ అని వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో తినేవారికి ఒక దేవుడు, తాగేవారికి ఒక దేవుడు, పెళ్లి కాని వారికి ఒక దేవుడు, ఇద్దరు పెళ్ళాలు ఉన్న వారికి ఒక దేవుడు, పెళ్లి కాని వారికి మరొక దేవుడు అంటూ వ్యంగ్యంగా మాట్లాడి దేవి దేవతల మధ్య విభజన తీసుకొచ్చే విధంగా వ్యవహరించారని అన్నారు. రాముడు కొందరికి దేవుడైతే, శివుడు మరి కొందరి దేవుడని మాట్లాడిన మరుసటి రోజే దిల్ సుఖ్ నగర్ లోని అమ్మవారి ఆలయంలో దాడి జరిగిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు దాడులు చేసే వారికి మద్దతుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. గతంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే భారతదేశం ముస్లింల దేశం అని ఈ దేశంలోని వనరుల పై మొదటి హక్కు ముస్లింలదేనని వ్యాఖ్యానించడం కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలను ప్రోత్సహించడం లాంటిదని అన్నారు.

అన్యమతస్తులు కేవలం హిందూ దేవాలయాల పై మాత్రమే దాడులు చేస్తున్నారని ఒకవేళ వారు మతిస్థిమితం లేని వారైతే చర్చిలు మసీదుల మీద ఎందుకు దాడులు చేయడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపతి జనార్ధన్, మండల నాయకులు సంఘు వెంకటగిరి, దశముఖి శివకుమార్, రామగిరి శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు

మోదీ సుపరిపాలనకు సంఘీభావం
- పెద్దపల్లిలో బైక్ యాత్రికులకు టీడీపీ నాయకుల ఘన సన్మానం



పెద్దపల్లి,అక్టోబర్ 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రజా జీవితంలో 25 వసంతాలు పూర్తి చేసుకోవడం దేశానికే గర్వకారణమని, ఆయన స్ఫూర్తిదాయక పాలనకు సంఘీభావంగా యువత చేపట్టిన ఈ సేవా సంకల్ప బైక్ యాత్ర దేశసేవ పట్ల యువతలో నవచైతన్యం నింపుతోందని తెలుగుదేశం పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు అక్కపాక తిరుపతి పేర్కొన్నారు.తిరుపతి అలిపిరి వద్ద ప్రారంభమై నాలుగు రాష్ట్రాల మీదుగా ఉత్తరప్రదేశ్ లోని వారణాసి వరకు 8 రోజుల పాటు సాగే ఈ బైక్ యాత్ర శనివారం పెద్దపల్లి జిల్లాకు చేరుకుంది.ఈ సందర్భంగా అక్కపాక తిరుపతి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు యాత్రికులకు శాలువాలు కప్పి,పూలమాలలతో ఘనంగా స్వాగతం పలికారు.అనంతరం అక్కపాక తిరుపతి మాట్లాడుతూ దేశ ప్రధానిగా నరేంద్ర మోదీ సాధించిన చారిత్రాత్మక మైలురాళ్లను, అందించిన నిరంతర ప్రజాసేవను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తెలుగు యువత,టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఈ సాహసోపేత యాత్రను చేపట్టడం అభినందనీయ మన్నారు. ప్రజా సేవలో మోదీ చూపిన బాట ప్రతీ ఒక్కరికీ మార్గదర్శకమని,ఈ యాత్ర దిగ్విజయంగా పూర్తికావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఐటిడిపి అధ్యక్షుడు హరికృష్ణ,పొగాకు జయరాం,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం,టీడీపీ నాయకులు కోల కిషన్ రావు, కొప్పుల మురళి,పెరిక శ్రీనివాస్,తోట వెంకటేష్, పటేల్ మల్లారెడ్డితో పాటు భారీ సంఖ్యలో తెలుగు యువత ప్రతినిధులు,పార్టీ కార్యకర్తలు పాల్గొని యాత్రికులకు అభినందనలు తెలిపారు.

ఆర్టీసీ డిపోల్లో ఐక్య కూటమి ప్రచారం





మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి అక్టోబర్ 3 (ప్రజాకలం) ఈ నెల 9న జరగనున్న టీజీఎస్ఆర్టీసీ ఎన్నికల నేపథ్యంలో ఆర్టీసీ ఐక్య కూటమి సంఘాల ఆధ్వర్యంలో మెట్‌పల్లి, కోరుట్ల ఆర్టీసీ డిపోల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిపోల్లో పని చేస్తున్న సిబ్బందిని ముఖాముఖిగా కలిసి కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఐక్య కూటమి సంఘాల చైర్మన్ ఈర్ల వెంకటేశ్వర్లు, కొమురయ్య, మౌలానా, సత్యపాల్ తదితరులతో కలిసి తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ కౌన్సిల్ మెంబర్, జగిత్యాల జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు ఏశమేని గణేష్ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలు, హక్కులు, సంక్షేమం తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. ఈ కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి సుతారి రాములు, మున్సిపల్ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి ఎండి ఉస్మాన్, ఖాతా వినయ్, చౌదరి శివకుమార్,ఓడలరాకేశ్, మాతంగి శ్రావణ్, మరంపల్లి రాజశేఖర్, వహీద్,భోజ సంపత్, నక్క కరుణాకర్ పాల్గొన్నారు.

ఏళ్ల నాటి సమస్యకు శాశ్వత పరిష్కారం
-కలెక్టర్‌కు షాపుల వ్యాపారుల పాలాభిషేకం



పెద్దపల్లి,అక్టోబర్ 03 (ప్రజాకలం జిల్లా ప్రతినిధి)

పెద్దపల్లి జిల్లా జూనియర్ కళాశాల కాంప్లెక్స్‌లోని షాపులలో వ్యాపారం చేసుకుంటున్న కిరాయిదారుల సమస్యను పరిష్కరించి,వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ ద్వారా షాటర్లను అందించేందుకు చర్యలు తీసుకున్న జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కి వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పల్లె సదానందం మాట్లాడుతూ,ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న షాపుల రిజిస్ట్రేషన్ సమస్యకు కలెక్టర్ ప్రత్యేక చొరవ చూపి శాశ్వత పరిష్కారం చూపారని,దీనివల్ల వ్యాపారులకు ఉపశమనం లభించి వారి హక్కులకు భరోసా ఏర్పడిందని కొనియాడారు.సమస్యను వెలుగులోకి తెచ్చి పరిష్కారానికి సహకరించిన పత్రికా మిత్రులకు, మీడియా ప్రతినిధులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.భవిష్యత్తులోనూ ప్రజా సమస్యలపై అధికారులు ఇలాగే స్పందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో షాపుల ప్రతినిధులు,స్థానికులు మోర మనోహర్,బండ కరుణాకర్,పెండ్యాల కుమార్,తాళ్ల లక్ష్మణ్,శానగొండ సంపత్ కుమార్, వెంకటేష్,కొండ్రా మనోహర్,అభిలాష్,ఫరూక్ తదితర షాప్ యజమానులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత
- అటవీ క్షేత్రాధికారి టి.సతీష్ కుమార్



పెద్దపల్లి,అక్టోబర్ 03:(ప్రజాకలం జిల్లా ప్రతినిధి) వన్యప్రాణుల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పెద్దపల్లి అటవీ క్షేత్రాధికారి టి.సతీష్ కుమార్ అన్నారు.శనివారం జిల్లా అటవీ అధికారి ఆదేశాల మేరకు పెద్దపల్లి,మంథని అటవీ విభాగాలు మరియు పోలీసు శాఖ సంయుక్తంగా పెద్దపల్లి మండలం కుర్మపల్లి గ్రామంలో విస్తృత తనిఖీలు నిర్వహించి, వేటకు ఉపయోగించే వలలు,ఇనుప వైర్లు,జాలీలు,ఉచ్చులు, కత్తులు,ఇనుప బోన్లు,నైలాన్ తాళ్లు మరియు బైండింగ్ వైర్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో నిర్వహించిన వన్యప్రాణి వారోత్సవాల అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అడవులను నరకడం మరియు వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని,అటవీ సంపదను కాపాడటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని కోరారు.ఎవరైనా అక్రమంగా వేటకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన అనంతరం, బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శ్రమదానం చేపట్టి పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మంథని అటవీ క్షేత్రాధికారి ఎమ్. వినయ్ నాయక్,ఉప క్షేత్రాధికారులు పి.దేవదాస్,ఎన్.రమేష్,జె.తిరుపతి, జి.కొమురయ్య,విభాగాధికారులు ఎస్.డి. రహమతుల్లా,ఎమ్.నరసయ్య,హెచ్.మం లాల్,ఎండి.అమిరుద్దీన్, రవి, ముదస్సర్ షా,బీట్ అధికారులు జి.రామ్మూర్తి,ఎస్. మేఘరాజ్,పవన్,ప్రదీప్, తిరుపతి, మాధురి, రంజిత,శ్రీకాంత్,అక్తర్ పాషా,రామ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో ప్రతిభ చాటిన గాయత్రి విద్యార్థి



పెద్దపల్లి,అక్టోబర్ 03:(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

ఇటీవల సుల్తానాబాద్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్–14 వాలీబాల్ పోటీలలో పెద్దపల్లి గాయత్రి విద్యానికేతన్‌కు చెందిన విద్యార్థి కే. గౌతమ్ ప్రతిభ చాటి ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీలలో అద్భుత ప్రదర్శన కనబరిచి గౌతమ్ సిల్వర్ మెడల్ సాధించాడు.జిల్లా స్థాయిలో పతకం సాధించిన గౌతమ్‌ను గాయత్రి విద్యా సంస్థల అధినేత శ్రీ అల్లంకి శ్రీనివాస్, గాయత్రి విద్యానికేతన్ కరస్పాండెంట్ శ్రీమతి రజనీ దేవి ప్రత్యేకం అభినందించి, శాలువాతో సత్కరించారు.విద్యార్థి సాధించిన ఈ విజయం పాఠశాలకు ఎంతో గర్వకారణమని వారు ప్రశంసించారు. అలాగే పాఠశాల ప్రిన్సిపాల్ విజయేందర్, పి. ఈ.టి మహేందర్ గౌతమ్‌ను అభినందిస్తూ భవిష్యత్తులో రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొని గౌతమ్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఎమ్మెల్యే నాగరాజుపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదు
ఎన్‌టీవీ యాజమాన్యం వెంటనే క్షమాపణ చెప్పాలి: నకరకంటి మోహన్ గౌడ్
అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ శ్రేణుల నిరసన.. దిష్టిబొమ్మ దహనం

హనుమకొండ, అక్టోబర్ 3:– (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్. నాగరాజుపై తప్పుడు ఆరోపణలు, నిరాధార ప్రచారాలు చేస్తే సహించేది లేదని ఐనవోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నకరకంటి మోహన్ గౌడ్ హెచ్చరించారు. ఇటీవల పీఏసీఎస్‌లకు సంబంధించిన చైర్మన్లు, డైరెక్టర్ల ఎంపికపై తప్పుడు కథనాలను ప్రచారం చేశారంటూ ఎన్‌టీవీ యాజమాన్యంపై ఆయన తీవ్రంగా ఖండన వ్యక్తం చేశారు.

తప్పుడు కథనాలను వెంటనే ఉపసంహరించుకోవాలి

ఎమ్మెల్యేగా ఎన్నికైన నాటి నుంచి వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి నాగరాజు కృషి చేస్తున్నారని మోహన్ గౌడ్ పేర్కొన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో ఎమ్మెల్యేకు ప్రజల్లో మంచి పేరు వస్తుండటాన్ని ఓర్వలేక కొందరు నిరాధార ఆరోపణలు, తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. వాస్తవాలను నిర్ధారించకుండా కథనాలు ప్రచురించడం సరికాదన్నారు.

పీఏసీఎస్ నియామకాలపై తప్పుడు ప్రచారం

పీఏసీఎస్ వ్యవసాయ శాఖకు సంబంధించిన చైర్మన్లు, డైరెక్టర్ల ఎంపిక ప్రక్రియ ఇటీవల పారదర్శకంగా జరిగిందని మోహన్ గౌడ్ తెలిపారు. అయితే ఈ ప్రక్రియపై వాస్తవాలకు విరుద్ధంగా కథనాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారని ఆయన పేర్కొన్నారు. తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేయడం ద్వారా ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం జరిగిందని విమర్శించారు.

అంబేద్కర్ సెంటర్‌లో నిరసన

తప్పుడు కథనాలను నిరసిస్తూ హనుమకొండ జిల్లా అంబేద్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహించారు. దప్పు చప్పుళ్లతో నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ శ్రేణులు, ఎన్‌టీవీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేసి తమ నిరసనను తెలిపారు.



క్షమాపణ చెప్పకపోతే కార్యాచరణ

తప్పుడు కథనాలపై ఎన్‌టీవీ యాజమాన్యం వెంటనే స్పందించి క్షమాపణ చెప్పాలని మోహన్ గౌడ్ డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆ సంస్థ కార్యాలయాన్ని ముట్టడించడంతో పాటు చట్టపరమైన చర్యలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే తప్పుడు ప్రచారాలను ఇకపై సహించేది లేదన్నారు.

పెద్ద సంఖ్యలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు

ఈ నిరసన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు, యువజన నాయకులు, మహిళలు, మీడియా ప్రతినిధులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.

అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం

గొల్లపల్లి అక్టోబర్ 03 ప్రజాకలం ప్రతినిధి గొల్లపల్లి మండల కేంద్రంలోని సెక్టార్ పరిధిలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సర్పంచ్ నల్ల నీరజ హాజరై వారు మాట్లాడుతూ గర్భిణీ బాలింతలు కిశోర బాలికలు అనీమియా రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలనీ, ప్రతి ఇంట్లో న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సూపర్వైజర్ జానకి మాట్లాడుతూ గర్భిణీ బాలింతల కిశోర బాలికలో రక్తహీనతకు గురయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుంది కాబట్టి తాజా ఆకుకూరలు, పాలు,పండ్లు మొలకెత్తిన గింజలు, మిల్లెట్స్,గుడ్లు, సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం సామూహిక శ్రీమంతాలు,అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి మధు ,ఉప సర్పంచ్ బుచ్చి రెడ్డి గారు, ఏ ఎన్ ఎం రజిత, అంగన్వాడి సెక్టారు టీచర్లు,గర్భిణీ, బాలింతలు ప్రీస్కూల్ పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.



సమాచార కమిషనర్ పీవీ శ్రీనివాస్‌కు టీఎంహెచ్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ ఆహ్వానం

ఖమ్మం, అక్టోబర్ 03,(ప్రజా కలం న్యూస్) తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ పీవీ శ్రీనివాస్ ఖమ్మం జిల్లాకు వచ్చిన సందర్భంగా తెలంగాణ మాదిగ హక్కుల దండోరా (టీఎంహెచ్‌డీ) రాష్ట్ర అధ్యక్షులు, దళితరత్న డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పుష్పగుచ్ఛంతో కమిషనర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ నెలలో టీఎంహెచ్‌డీ ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించనున్న "భారత రాజ్యాంగం–సామాజిక న్యాయంపై అవగాహన సదస్సు"కు ముఖ్య అతిథిగా హాజరు కావాలని పీవీ శ్రీనివాస్‌ను ఆహ్వానించారు. జిల్లా వ్యాప్తంగా అంబేద్కర్‌వాదులు, బహుజనవాదులు, మేధావులు, ఉద్యోగులు, విద్యార్థులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేయాలని డాక్టర్ కొరిపల్లి శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జీవి, డాక్టర్ కొండలరావు, పిల్లిగుండ్ల ముత్తయ్య, రాయల నాగేశ్వరరావు, కిన్నెర ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.



నైపుణ్యంతోనే మహిళా సాధికారత

యువతులు స్వయం ఉపాధి సాధించి కుటుంబాలకు అండగా నిలవాలి

ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నిర్మల్ అక్టోబర్ 03(ప్రజా కలం జిల్లా ప్రతినిధి): యువతులు ఏదో ఒక వృత్తిలో నైపుణ్యం సాధించి స్వయం ఉపాధి పొందుతూ తమ సొంత కాళ్లపై నిలబడాలని ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. భైంసా పట్టణంలోని శ్రీ షిరిడి సాయి సేవా సొసైటీ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ పూర్తి చేసుకున్న యువతులకు నిర్వహించిన సర్టిఫికెట్ల ప్రదానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న యువతులకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నేటి పోటీ ప్రపంచంలో యువతులకు వృత్తి నైపుణ్యం ఎంతో అవసరమని అన్నారు. ఒక నైపుణ్యాన్ని నేర్చుకుంటే ఎక్కడైనా ఉపాధి పొందడంతో పాటు స్వయం ఉపాధి ద్వారా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవచ్చని తెలిపారు. యువతులు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం నుంచి అందించే కుట్టు మిషన్లు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. యువతులకు ఉపాధి కల్పించే దిశగా వృత్తి నైపుణ్య శిక్షణ అందిస్తున్న శ్రీ షిరిడి సాయి సేవా సొసైటీ సేవలను ఎమ్మెల్యే అభినందించారు. యువతులు శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భైంసా మున్సిపల్ చైర్మన్ తుమోల్ల దత్తాత్రి, ఎస్ ఆర్ టి, ఆర్ ఐ చైర్మన్ కిషోర్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు, మహిళలు తదితరులు ఉన్నారు.

కల్యాణి ఎంపీపీఎస్ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా టీషర్ట్‌ల పంపిణీ!



తానూర్, అక్టోబర్ 03(ప్రజా కలం): నిర్మల్ జిల్లా తానూర్ మండలం కల్యాణి ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు శనివారం గ్రామ సర్పంచ్ ఆర్. శ్యామ్‌కాబాయి దాతృత్వంతో ఉచితంగా టీషర్ట్‌లు పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి. నరేందర్, హెచ్ఎం కే. బాలాజీతో పాటు పాఠశాల సిబ్బంది పాల్గొని విద్యార్థులకు టీషర్ట్‌లను అందజేశారు, బడి పిల్లలకు బాసటగా నిలిచిన సర్పంచ్ శ్యామ్‌కాబాయి, మోహన్‌రావు పాటిల్, గణపత్ పాటిల్, భగవాన్ పాటిల్, రవి పాటిల్ పాటిల్ లను అధికారులు, గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు.

మంత్రుల పర్యటనను విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 03 (ప్రజా కలం ప్రతినిధి) రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ఇతర ఉన్నతాధికారుల సోమవారం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్, సోమవారం నాటి మంత్రుల పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అధికారులందరూ సంబంధిత నివేదికలతో సిద్ధంగా ఉండాలన్నారు. మంత్రుల పర్యటనకు తగిన ఏర్పాట్లను చేయాలని పేర్కొన్నారు. ఆయా అధికారులకు వివిధ బాధ్యతలను అప్పగించి, పలు కీలక సూచనలు చేశారు. తగిన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించాలని స్పష్టం చేశారు. అధికారులంతా సమయానికి సమావేశానికి హాజరు కావాలని అన్నారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఏఎస్పీ సాయికిరణ్ వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ఎటపాక మండలంలో వైఎస్ఆర్‌సీపీ

విస్తృత స్థాయి సమావేశం

- స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహకాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం



ప్రజాకలం ప్రతినిధి, ఎటపాక, అక్టోబర్ 03:

పోలవరం జిల్లా,ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి విస్తృత సమావేశం, స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం నిర్వహించారు. గన్నవరం గ్రామానికి చెందిన ఆకుల దయాకర్ నివాసం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు ఆకుల వెంకటరామారావు (పెద్దోడు) అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ముందుగా దివంగత మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరై మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రకటించిన సూపర్ సిక్స్ హామీల్లో ఏ ఒక్కటీ అమలు కాలేదని ఆమె ఆరోపించారు. ముఖ్యంగా యువతకు హామీ ఇచ్చిన నిరుద్యోగ భృతి, మహిళలకు నెలకు రూ.3,000 ఆర్థిక సాయం అమలు కాలేదని ప్రజలకు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని ఆమె పిలుపునిచ్చారు. అనంతరం మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, సర్పంచులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆకుల వెంకటరామారావు (పెద్దోడు), రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు, మండల సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు గొంగడి వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపీపీ కాకా కామేశ్వరి, మాజీ జడ్పీటీసీ ఉబ్బు సుస్మిత, యువజన విభాగం నాయకుడు తోట శశికుమార్, మండల మహిళా అధ్యక్షురాలు గుడిమళ్ల నాగలక్ష్మి, మాజీ ఎంపీటీసీ అంజలి, మండల కార్యదర్శి ముక్కు కల్పన, ఎస్టీ సెల్ అధ్యక్షుడు చిచ్చుడి రామారావు, రైతు విభాగం అధ్యక్షుడు ధారా రమేష్, గన్నవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు వీర ప్రకాష్, గన్నవరం ఎస్ఎంసీ చైర్మన్ మోట వంశీ, ఇంటలెక్చువల్ విభాగం అధ్యక్షుడు కురినాల విజయ్, స్టూడెంట్ విభాగం మండల అధ్యక్షుడు మైసాక్షి రాకేష్, కుచ్చాలపాటి వెంకటేశ్వర్లు, అన్నెం జయచంద్రరెడ్డి, సారెడ్డి, శ్రీనివాసరెడ్డి, చింతూరు మండల పార్టీ అధ్యక్షుడు రామలింగారెడ్డి, మాజీ జడ్పీటీసీ చిచ్చుడి మురళి, రంపచోడవరం మండల పార్టీ అధ్యక్షుడు జల్లేపల్లి రామన్న దొరతో పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం సంతకాల సేకరణ

- టీ డబ్ల్యు యం ఎఫ్ జిల్లా ఇంచార్జీ గుండా ఉపేందర్ రెడ్డి



పాలేరు అక్టోబర్ 03(ప్రజా కలం న్యూస్)

కూసుమంచి మండల కేంద్రంలో ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం సంతకాల సేకరణ వివిధ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలతో కలసి ప్రారంభిస్తున్నాం అని తెలియ చేస్తున్నాము.నిత్యం వేలాది మంది ప్రజలు ముఖ్యంగా విద్యార్థులు, గర్భిణులు బస్ స్టాండ్ లేకపోవడం, కనీసం నిల్చివడానికి కాస్త జాగా కూడా లేకపోవడంతో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. దానికి తోడు హైదరాబాద్ వెళ్ళుటకు తగిన బస్ సర్వీసులు కూడా లేకపోవడం, నడుస్తున్న బస్సులు బైపాస్ రోడ్డులో వెళ్ళుట వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా ఉదయం 4 గంటలకు మరియు 4 : 30 నిమిషాల ఖమ్మం నుండి హైదరాబాద్ వెళ్ళు ఎక్స్ప్రెస్ సర్వీసుల రద్దుతో హైద్రాబాద్ లో విద్య అభ్యసించే విద్యార్థిని విద్యార్థులు, హాస్పిటల్ కు వెళ్ళే వారు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున సత్వరమే కూసుమంచి మండల కేంద్రంలో బస్ స్టాండ్ నిర్మాణం చేపట్టాలని, కూసుమంచి మండల కేంద్రం ద్వారా అన్ని రకాల ఎక్స్ప్రెస్ డీలక్స్ సూపర్ లక్సరీ సర్వీసులు నడపాలని, ఉదయం నడిచే ఎక్స్ప్రెస్ సర్వీసుల పునరుద్ధరణ చేయాలని, నాన్ స్టాప్ రాజధాని బస్సులు కూసుమంచి బైపాస్ రోడ్డులో ఫ్లై ఓవర్ దగ్గర స్టాప్ సౌకర్యం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ రద్దీ సమయంలో స్పెషల్ బస్సు సర్వీసులు పేరుతో అదనపు ఛార్జీలు రద్దు చేయాలని సంతకాల సేకరణ చేపట్టి, పూర్తి చేసి స్థానిక మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్ కి ఆర్టీసీ చైర్మన్ నాగిరెడ్డి,కి సంబధిత ప్రతులు అందచేస్తాము అని తెలియ చేస్తున్నాము. సంతకాల సేకరణ లో వార్డు సభ్యులు చెరుకుపల్లి వీరయ్య, కొక్కిరేణి వెంకన్న, రేపాల శ్యామ్ సుందర్, నలగాటి రామనాధం, కొనరెడ్డి, భారీ రమేష్, మంద నాగులు, అర్వపల్లి వెంకటేశ్వర్లు, మంద చంద్ర శేఖర్ గౌడ్ ,అడపా శివ, గోపే విజయపాల్, బద్దం వెంకటరెడ్డి పిట్టల వేణు, మంద నాగేశ్వరరావు , దార జనార్దన్ తదితరులు పాల్గొన్నారు

కోయిల్‌కొండ తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో రైతు మృతి ఘటనపై తహశీల్దార్ వివరణ

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 03:

కోయిల్‌కొండ తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో శనివారం చోటుచేసుకున్న రైతు పసుల లావప్ప (50) మృతి ఘటనపై కోయిల్‌కొండ తహశీల్దార్ జి. దీపక్‌రావు వివరాలు వెల్లడించారు. కోయిల్‌కొండ మండలం పార్వల్లి గ్రామానికి చెందిన పసుల లావప్ప తహశీల్దార్ కార్యాలయ ఆవరణలోని చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందినట్లు తహశీల్దార్ తెలిపారు. ఉదయం సుమారు 6.30 గంటలకు ఈ ఘటనపై సమాచారం అందిన వెంటనే ఉన్నతాధికారులు, పోలీసులకు సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని నిబంధనల ప్రకారం ప్రాథమిక విచారణ చేపట్టిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

భూ వివాదంపై కుమారుడి వాంగ్మూలం

మృతుడి కుమారుడు పసుల కురుమూర్తి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, పార్వల్లి శివారులోని సర్వే నంబర్ 211లోని వ్యవసాయ భూమికి సంబంధించి కుటుంబ సభ్యుల మధ్య కొంతకాలంగా వివాదం కొనసాగుతున్నట్లు తహశీల్దార్ తెలిపారు. దయ్యాలి లక్ష్మయ్య, పసుల చంద్రశేఖర్, పసుల విష్ణు, దయ్యాల రామకృష్ణ అనే వ్యక్తులు వ్యవసాయ భూమిలోకి ప్రవేశించి హద్దు రాళ్లను తొలగించేందుకు ప్రయత్నించడం, పంటకు నష్టం కలిగించడం, తన తండ్రిపై దాడికి ప్రయత్నించడం, బెదిరింపులకు పాల్పడినట్లు మృతుడి కుమారుడు తన వాంగ్మూలంలో పేర్కొన్నట్లు తెలిపారు. అదేవిధంగా, మృతుడు రాసినట్లు పేర్కొంటున్న సూసైడ్ నోట్‌లో కొందరి పేర్లు ఉన్నట్లు పోలీసుల దృష్టికి వచ్చినట్లు తహశీల్దార్ తెలిపారు. ఆ నోట్‌లో పేర్కొన్న వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి కుమారుడు పోలీసులను కోరినట్లు వివరించారు. సూసైడ్ నోట్, కుటుంబ సభ్యుల వాంగ్మూలం, ఘటనకు దారితీసిన పరిస్థితులపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.



సర్వే నంబర్ 211కు సంబంధించిన రెవెన్యూ రికార్డులు

సర్వే నంబర్ 211కు సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించినట్లు తహశీల్దార్ తెలిపారు. 1954–55 ఖస్రా పహాణీ ప్రకారం సర్వే నంబర్ 211లో మొత్తం 18.39 ఎకరాల పట్టా భూమి ఉన్నట్లు రికార్డుల్లో నమోదై ఉండగా, టిప్పన్ ఆధారంగా నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో 17.39 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. ఈ భూమికి సంబంధించిన భౌతిక స్వాధీన అంశంపై కుటుంబ సభ్యుల మధ్య వివాదం ఉన్నట్లు పేర్కొన్నారు.

సంబంధిత సర్వే నంబర్ లో పేర్కొన్న భూమి కి మృతుడికి ఎటువంటి సంబంధం లేదని తహశీల్దార్ వివరించారు.

మృతుడి కుటుంబ వివరాలు

విచారణలో వెల్లడైన వివరాల ప్రకారం మృతుడు పసుల లావప్ప పార్వల్లి గ్రామానికి చెందినవారని, ఆయనకు కనకమ్మ, మంజుల అనే ఇద్దరు భార్యలు మృతి చెందినట్లు తహశీల్దార్ తెలిపారు. వేణుగోపాల్, కుర్మయ్య, గంగాధర్ అనే ముగ్గురు కుమారులు, నాగేశ్వరమ్మ అనే కుమార్తె ఉన్నట్లు పేర్కొన్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారని తహశీల్దార్ దీపక్‌రావు తెలిపారు. సూసైడ్ నోట్, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు, పోస్టుమార్టం నివేదిక, రెవెన్యూ రికార్డులు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం దర్యాప్తు నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లతో పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు

నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

ప్రజాకలం ప్రతినిధి, అశ్వాపురం, అక్టోబర్ 03: అశ్వాపురం మండలం తుర్రంవారి గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నూతనంగా నిర్మించుకున్న ఇళ్ల గృహప్రవేశ వేడుకల్లో పినపాక ఎమ్మెల్యే, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. గ్రామానికి చెందిన లబ్ధిదారులు బానోతు అచ్చమ్మ, బానోతు శైలజ నూతన గృహప్రవేశ కార్యక్రమాల్లో పాల్గొని వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే లబ్ధిదారులతో ఆత్మీయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేరడం పేద కుటుంబాలకు ఆనందం, భరోసాను కలిగించే విషయమని అన్నారు. నూతన గృహాల్లో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు.పేద కుటుంబాలకు సొంతింటి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో పేద కుటుంబాలకు మెరుగైన నివాస వసతులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పినపాక నియోజకవర్గంలో ప్రజలకు అవసరమైన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఓరుగంటి రమేష్ బాబు, జిల్లా ముఖ్య నాయకులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



అక్టోబర్ 10న నిరసన దీక్షను జయప్రదం చేయండి

- ప్రజా సంక్షేమ సంఘం మహిళ కమిటీ పిలుపు



ప్రజాకలం ప్రతినిధి, భద్రాచలం, అక్టోబర్ 03: భద్రాచలంలో పేదల సమస్యల పరిష్కారం కోసం ప్రజా సంక్షేమ సంఘం మహిళ కమిటీ ఆధ్వర్యంలో అక్టోబర్ 10న నిర్వహించనున్న నిరసన దీక్షను జయప్రదం చేయాలని మహిళ కమిటీ అధ్యక్షురాలు అందే దుర్గ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఏఎంసీ కార్యాలయం వద్ద నిరసన దీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అందే దుర్గ మాట్లాడుతూ.. భద్రాచలంలో ఏళ్ల తరబడి జీవిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేదలందరికీ భూమి, విద్య, ఉద్యోగం, ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఇల్లు నిర్మించుకునే స్థోమత లేని నిరుపేదలకు ప్రభుత్వం భూమిని కొనుగోలు చేసి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదల సమస్యల పరిష్కారం కోసం భద్రాచలం అంబేద్కర్ సెంటర్‌లో రిలే నిరసన దీక్ష చేపట్టనున్నట్లు ఆమె తెలిపారు. ఈ దీక్ష కార్యక్రమానికి భద్రాచలం పట్టణంలోని నిరుపేదలు అధిక సంఖ్యలో హాజరై దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో దళాయి స్వర్ణ, సత్యవేణి, ప్రమీల, సుజాత, రేవతి, మేరీ, జయమ్మ, ఝాన్సీ, శ్రీదేవి, దాసరి నాగమణి తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల దరఖాస్తులు పెండింగ్ లో ఉంచకూడదు:

- భూముల రీ సర్వే ప్రక్రియ వేగవంతంగా చేయాలి

- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

నిర్మల్ అక్టోబర్ 03 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జిల్లాలో భూ సమస్యలకు సంబంధించి అన్ని దరఖాస్తుల ను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరే ట్లోని సమావేశ మందిరంలో భూ సంబంధిత దరఖాస్తుల పరి ష్కారం, భూముల రీ సర్వే పై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించా రు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మండలాల వారిగా పెండింగ్ లో ఉన్న భూ భారతి, రెవెన్యూ సదస్సులు, సదాబైనమా, దరఖాస్తుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ను త్వరితగతిన పూర్తి చేయాలని చెప్పారు. సర్వే బృందం మొత్తం తప్పనిసరిగా క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. ఈ సమావేశంలో ఇన్ ఛార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ రాకేష్, ఆర్డీవో దేవీదాస్, రెవెన్యూ, సర్వే శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 03:మిషన్ భగీరథ ద్వారా జిల్లాలో తాగునీటి సరఫరా పరిస్థితిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయం తన ఛాంబర్ నుండి వెబెక్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మిషన్ భగీరథ డీఈలు, ఈఈలు, ఏఈలతో జిల్లాలో తాగునీటి సరఫరా, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కారానికి చేపడుతున్న చర్యలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని పరిశీలించి, ప్రజలకు సురక్షితమైన తాగునీరు క్రమం తప్పకుండా అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.తాగునీటి సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని, పైప్‌లైన్లు, నీటి సరఫరా వ్యవస్థలో తలెత్తే సాంకేతిక సమస్యలను సత్వరమే గుర్తించి పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు.



గోదావరి పుష్కరాల పనులు గడువులోగా పూర్తి చేయాలి

- రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్




నిర్మల్ అక్టోబర్ 03 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) గోదావరి పుష్కరాల పనులన్నీ గడువులోగా రాష్ట్ర దేవాదాయ శాఖ సెక్రటరీ శైలజా రామయ్యర్ కలెక్టర్లను ఆదేశించారు. శనివారం సాయంత్రం దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావుతో కలిసి హైదరాబాదు నుంచి పలు జిల్లాల కలెక్టర్లతో పుష్కరాల పనులపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పుష్కరాల పనులను కలెక్టర్లు, నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. పుష్కరాలకు అవసరమైన భూసేకరణకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. పుష్కరాల పనులపై పలు కీలక సూచనలు చేశారు. పనులు పూర్తి చేయడానికి గడువు నిర్ణయించుకొని, ఆ గడువులోగా పనులు పూర్తి చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పుష్కరాల పనులను సమన్వయంతో చేపట్టాలని అన్నారు. నిర్మాణ పనులకు ఇసుక కొరత తలెత్తకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కలెక్టరేట్ లోని సమావేశ మందిరం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బాసరతో పాటు, జిల్లాలో పుష్కరాలు జరిగే అన్ని ప్రాంతాల్లో పకడ్బందీగా పనులు చేపడుతున్నట్లు వివరించారు. సంబంధిత అన్ని శాఖల సమన్వయంతో పనులు గడువులోగా పూర్తయ్యేలా చూస్తామన్నారు. పుష్కరాల పనులు నాణ్యవంతంగా చేపడతామని తెలిపారు. పనులను నిరంతరం పర్యవేక్షిస్తామన్నారు. ఈ వీసీలో నీటిపారుదల, ఆర్ అండ్ బి, ఆర్డబ్ల్యూఎస్, నీటిపారుదల లు సుభాష్, అనిల్, సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను ఆశీర్వదించిన కోడూరి వీరకృష్ణ

గొల్లగూడెంలో ఘనంగా జరిగిన దీత్యా ఓణీల అలంకరణ వేడుక

కార్యక్రమంకు నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు కోడూరి హాజరు



తల్లాడ అక్టోబర్ 3, ప్రజా కలం న్యూస్

తల్లాడ మండలం గొల్లగూడెం గ్రామానికి చెందిన ఇస్నేపల్లి వెంకటేశ్వర్లు,లావణ్య దంపతుల కుమార్తె ఇస్నపల్లి దీత్యా పట్టు వస్త్రాలంకరణ,వారి కుమారుడు ఆదిత్యల పంచకట్టు వేడుకలు కుటుంబ సభ్యులు, బంధుమిత్రుల సమక్షంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు సత్తుపల్లి నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు కోడూరి వీరకృష్ణ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు.ఈ సందర్భంగా కోడూరి వీరకృష్ణ చిన్నారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ దీత్య, ఆదిత్య లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఎదిగి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో పాల్గొని ఆత్మీయంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏజే ఎఫ్ టి నాయకులు ఇస్నేపల్లి లక్ష్మణ్, వార్డు మెంబర్ కోడూరి దుర్గారావు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇస్నేపల్లి వీరయ్య, నంద్రు రామకోటి, ఇస్నేపల్లి తిరుపతిరావు, గొల్లమందల ఏసోబు తదితరులు పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషుల సందడితో వేడుకలు ఉత్సాహభరితంగా సాగాయి.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

ఎన్సిపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మద్దిశెట్టి సామేలు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ప్రజా కలం న్యూస్:అక్టోబర్ 03:

ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభంగా నిలుస్తున్న జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వాలు విస్మరించకూడదని,ముఖ్యంగా జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పక్కా గృహ వసతి కల్పించాలని, మరియు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎన్సీపీ పార్టీ ఎన్డీఏ మహాకూటమి ఎన్నికల జాతీయ కార్యవర్గ సభ్యులు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మద్దిశెట్టి సామేలు రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మద్దిశెట్టి సామేలు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది జర్నలిస్టులు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ సమాజానికి ఎంతో సేవ చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి వెళ్లాలన్నా, ప్రజల సమస్యలు ప్రభుత్వం దృష్టికి వెళ్లాలన్నా జర్నలిస్టుల పాత్ర కీలకమన్నారు. అలాంటి జర్నలిస్టులు నేడు



సొంత ఇల్లు లేక అద్దె ఇళ్లలో ఇబ్బందులు పడుతుండడం బాధాకరమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో జిల్లా, నియోజకవర్గం, డివిజన్, మండలం స్థాయిలో పనిచేసే జర్నలిస్టులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మద్దిశెట్టి ఆవేదన వ్యక్తం చేశారు.చాలా మందికి సొంత మోటార్ సైకిల్ కూడా లేదని, కనీసం రోజువారీ వార్తల సేకరణకు అవసరమైన పెట్రోల్ ఖర్చులకు కూడా ఇబ్బంది పడుతున్న పరిస్థితి ఉందన్నారు. అద్దె ఇళ్లలో ఉంటూ, పిల్లల చదువులు, కుటుంబ పోషణ భారంతో దయనీయ స్థితిలో ఉన్నారని తెలిపారు.

జర్నలిస్టులకు ప్రభుత్వం ఆదుకోవాలి:

అర్హులైన జర్నలిస్టులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద గృహ వసతి కల్పించడంతో పాటు, అందుబాటులో ఉన్న ప్రభుత్వ భూముల్లో ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించుకునే అవకాశం కల్పించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్లు, ప్రభుత్వ అధికారులు, జర్నలిస్ట్ యూనియన్లతో సమన్వయం చేసుకుని నిజంగా అర్హులైన, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న జర్నలిస్టులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ఇళ్లు, స్థలాలు మంజూరు చేయాలని కోరారు.ఈ మేరకు త్వరలోనే కేంద్ర ప్రభుత్వానికి, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వినతిపత్రం సమర్పించనున్నట్లు మద్దిశెట్టి సామేలు తెలిపారు.

మున్సిపాల్టీల్లో అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు వేగవంతం చేయాలి

-స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్



మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 03:

మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు, జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర మున్సిపాలిటీల పరిధిలో వివిధ అభివృద్ధి, పారిశుద్ధ్య పనుల పురోగతిపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ శనివారం అధికారులతో సమీక్షించారు.కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుంచి వెబెక్స్ ద్వారా మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, ఇంజినీరింగ్, రెవెన్యూ అధికారులతో నిర్వహించిన సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ తో పాటు జిల్లాలోని మున్సిపాల్టీల్లో చేపడుతున్న అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలనీ అన్నారు.ముఖ్యంగా పన్నుల సేకరణ, ఆదాయ వనరులు విభాగంలో ఆస్తి పన్ను వసూళ్లు, ట్రేడ్ లైసెన్సులు, దుకాణాల అద్దెలు, ట్యాప్ కలెక్షన్స్ యాక్షన్ ప్లాన్‌పై తదితర విషయాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణాభివృద్ధి, ఇంజినీరింగ్ విభాగంలో భవన నిర్మాణ అనుమతులు, అభివృద్ధి పనులు, ఇందిరమ్మ ఇళ్లు, లైవ్ అథెంటికేషన్ అంశాల పురోగతిని పై కూడా అదనపు కలెక్టర్ అధికారులతో సమీక్షించి వాటిని వేగవంతం చేయాలని సూచించారు. పారిశుద్ధ్యం, పర్యావరణంకు సంబంధించి పారిశుద్ధ్య పనులు, పారిశుద్ధ్య కార్మికుల హాజరు, మొక్కల పెంపకం, ప్రజా సేవలులో ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం, ప్రతిరోజూ ఇంటింటికీ తాగునీటి సరఫరా పరిస్థితిని పై కూడా అదనపు కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశిత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేయాలని, పెండింగ్ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో మహబూబ్ నగర్ మున్సిపల్ కమిషనర్ రామానుజులరెడ్డి, భూత్పూర్, దేవరకద్ర, జడ్చర్ల మున్సిపల్ కమిషనర్లు ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక ఈ మహిళా సమాఖ్య భవనం

- హిళల సౌకర్యాల కోసం మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి అక్టోబర్ 03:

మహిళల ఆత్మగౌరవం, ఐక్యతకు ప్రతీకగా నిర్మించిన ఈ భవనాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే లిశ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి లి అన్నారు. మర్లు ప్రాంతంలోని ఎంప్లాయిస్ కాలనీలో ఎస్డీఎఫ్, ముడా, మున్సిపల్ నిధులు 65 లక్షలతో నిర్మించిన మహిళల సమాఖ్య భవనాన్ని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం మహిళలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, నగరంలోని వివిధ వార్డులు, కాలనీల నుంచి పెద్ద సంఖ్యలో తరలివచ్చిన మహిళా సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. గతంలో మర్లు ప్రాంతంలోని పలు కాలనీలకు సరైన రహదారి సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, తాను బాధ్యతలు చేపట్టిన రెండున్నర ఏళ్లలోనే సుమారు 100 కోట్లతో నగరంలోని వివిధ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. నగర భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని 603 కోట్ల భారీ నిధులతో భూగర్భ డ్రైనేజీ (యూజీడీ) పనులకు శ్రీకారం చుట్టామన్నారు. అలాగే నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా శాశ్వత తాగునీటి పరిష్కారం కోసం 220 కోట్లతో 14 ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్మాణ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నామని స్పష్టం చేశారు. గత రెండున్నర సంవత్సరాలుగా ప్రజల అవసరాలను గుర్తించి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు తమ సమావేశాలు నిర్వహించుకోవడానికి గతంలో చెట్ల కింద, పాఠశాలల వద్ద, ఆటస్థలాల్లో ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, ఇకపై అలాంటి పరిస్థితి ఉండకూడదనే ఉద్దేశంతో ఈ భవనాన్ని నిర్మించామని చెప్పారు. ఈ భవనం మహిళల ఆత్మగౌరవానికి, ఆత్మీయతకు ప్రతీకగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ భవన నిర్మాణానికి ఎస్డీఎఫ్ ముడా మున్సిపల్ ద్వారా రూ.65 లక్షల నిధులు కేటాయించి నిర్మించామని గుర్తు చేశారు. మహిళా సమాఖ్య భవనానికి అదనంగా వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. త్వరలోనే కాంపౌండ్ వాల్ నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ఏడాది ఈ భవనంపై మరో అంతస్తు నిర్మించి మరింత మంది మహిళలకు ఉపయోగపడేలా విస్తరించాలనే ఆలోచన ఉందన్నారు. ఈ భవనాన్ని కేవలం మహిళా సంఘాల సమావేశాలకే పరిమితం చేయకుండా, దేవీ నవరాత్రులు వంటి పండుగలు, ఇతర సామూహిక కార్యక్రమాలను కూడా మహిళలందరూ ఐక్యంగా నిర్వహించుకోవాలని సూచించారు. మహిళలందరూ ఈ భవనాన్ని తమ సొంత ఇంటిలా భావించి పరిశుభ్రంగా, సౌకర్యవంతంగా నిర్వహించుకోవాలని కోరారు. మహిళలకు గౌరవం, సముచిత స్థానం కల్పించడంతో పాటు వారి సామాజిక ఐక్యత, సాధికారతకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో నగర మేయర్ శ్రీమతి గుమ్మాల మమత శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిరాజ్ ఖాద్రీ, మైత్రి యాదయ్య, జిల్లా యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంజీవరెడ్డి, కార్పొరేటర్లు సువర్ణ కిషన్ నాయక్, గుముడాల రాధ గోవర్ధన్ గౌడ్, సిబి పూజిత, సల్మాన్, రఘు, తాహెర్, నాయకులు గంగిరెడ్డి, కంచి లక్ష్మణ్, చంద్రమౌళి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరేళ్ల బాలుడి మృతి..

- ఆర్ఎంపీ చికిత్సపై తండ్రి తీవ్ర ఆరోపణలు!

- న్యాయం చేయాలని కలెక్టర్‌కు వినతి.. విచారణకు డీఎంహెచ్ఓకు ఆదేశాలు




గద్వాల ప్రతినిధి । అక్టోబర్ 3 । ప్రజా కలం

జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం తాటికుంట గ్రామానికి చెందిన బోయ ఎల్లప్ప తన ఆరేళ్ల కుమారుడు నాని మృతిపై గ్రామంలో ఆర్ఎంపీగా వైద్యం చేస్తున్న మహేందర్ గౌడ్‌పై ఆరోపణలు చేస్తూ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్‌కు వినతిపత్రం సమర్పించారు. తన కుమారుడికి అందించిన చికిత్సపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాలను వెలుగులోకి తీసుకువచ్చి న్యాయం చేయాలని కోరారు. ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 4న తన కుమారుడు నానికి జ్వరం రావడంతో మహేందర్ గౌడ్‌ను సంప్రదించారు. రక్త పరీక్ష అవసరమని చెప్పి బాలుడి నుంచి రక్త నమూనా తీసుకుని అయిజకు వెళ్లినట్లు తెలిపారు. అనంతరం బాలుడికి మలేరియా, టైఫాయిడ్ ఉన్నట్లు చెప్పినప్పటికీ రక్త పరీక్ష నివేదికను తమకు ఇవ్వలేదని పేర్కొన్నారు. సాయంత్రం బాలుడిని తన వద్దకు తీసుకురావాలని చెప్పడంతో సుమారు 5 గంటలకు తీసుకెళ్లినట్లు తెలిపారు. అక్కడ సెలైన్ పెట్టడంతో పాటు రెండు ఇంజక్షన్లు ఇచ్చారని, కొద్దిసేపటి తర్వాత ఇంటికి తీసుకెళ్లవచ్చని చెప్పినట్లు పేర్కొన్నారు. ఇంటికి తీసుకెళ్లిన కొద్దిసేపటికే బాలుడు వాంతులు చేసుకోవడంతో ఆర్ఎంపీకి ఫోన్ చేసినట్లు తెలిపారు. అనంతరం ఆయన ఇంటికి వచ్చి బాలుడిని వెంటనే గద్వాలకు తీసుకెళ్లాలని సూచించినట్లు ఎల్లప్ప పేర్కొన్నారు. గద్వాలలోని వైద్యులను సంప్రదించగా, గతంలో అందించిన చికిత్సకు సంబంధించిన మందులు, రశీదులు, వివరాలను తీసుకురావాలని సూచించినట్లు తెలిపారు. ఆర్ఎంపీకి ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో బాలుడిని కర్నూలుకు తీసుకెళ్లినట్లు చెప్పారు. కర్నూలులో వైద్యులు చికిత్స అందించినప్పటికీ మరుసటి రోజు ఉదయం బాలుడు మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.తన కుమారుడి మృతికి ఆర్ఎంపీ అందించిన చికిత్స కారణమై ఉండవచ్చని ఎల్లప్ప ఆరోపించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను కోరారు. వినతిపత్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఘటనపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని డీఎంహెచ్ఓకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

ఎమ్మార్పీఎస్ - టి మండల అధ్యక్షుడిగా గుగ్గిళ్ల రాజు కుమార్

- ఏకగ్రీవంగా ఎన్నికైన మండల, గ్రామ కమిటీలు



మల్హర్, అక్టోబర్ 03 ప్రజాకలం ప్రతినిధి : మాదిగ రాజకీయ పోరాట సమితి తెలంగాణ వ్యవస్థాపకులు ప్రభాకర్ మాదిగ ఆదేశాల మేరకు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు బూడిద సమ్మయ్య మాదిగ సమక్షంలో శనివారం మల్హర్‌రావు మండల, తాడిచర్ల గ్రామ నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా గుగ్గిళ్ల రాజ్‌కుమార్ మాదిగ, ఉపాధ్యక్షుడిగా ఇందారపు మొగిలి మాదిగ, ప్రధాన కార్యదర్శిగా బూడిద శ్రావణ్, ప్రచార కార్యదర్శిగా రోడ్డ సంజీవ్, కార్యదర్శులుగా ఇందారపు రంజిత్, కొలుగోరి సందీప్ ఎన్నికయ్యారు. తాడిచర్ల గ్రామ అధ్యక్షుడిగా కొలుగూరి సంపత్, ఉపాధ్యక్షుడిగా తాండ్ర ఆశీర్వాదం, ప్రధాన కార్యదర్శిగా తాండ్ర సదానందం, ప్రచార కార్యదర్శిగా ఇనుగాల సతీష్, కార్యదర్శిగా తాండ్ర కిరణ్ కుమార్ ఎన్నికయ్యారు.గ్రామ గౌరవ సభ్యులుగా ఇందారపు రాజ పోచయ్య (పెద్దన్న), ఇందారపు దినేష్ (ఓదెలు), ఇందారపు విజయ్, ఇందారపు శివాజీ, ఇందారపు రమేష్, తాండ్ర రవి, ఇందారపు ఓదెయ్యలను నియమించారు.నూతన కమిటీ సభ్యులు సమాజ సేవతో పాటు ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని జిల్లా నాయకత్వం పిలుపునిచ్చింది. తనకు మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి గుగ్గిళ్ల రాజ్‌కుమార్ మాదిగ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందారపు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ది బెస్ట్ వెడ్డింగ్ ఫోటో గ్రాఫర్ అవార్డు ను అందుకున్న ఖమ్మం వాసి మోతుకూరి అశోక్ కుమార్

ఖమ్మం అక్టోబర్ 03(ప్రజా కలం న్యూస్) ఖమ్మం ఇటీవలే ఉభయ తెలుగు రాష్ట్రాలు తెలంగాణ , ఆంధ్ర ప్రదేశ్ సంయుక్తంగా నిర్వహించిన ఫోటోగ్రఫీ అవార్డు లలో ది బెస్ట్ వెడ్డింగ్ ఫోటో గ్రాఫర్ అవార్డు ను మాజీ తెలంగాణ ఫోటోగ్రాఫైర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్ చే ఎస్ ఎస్ కన్వెన్షన్ హాల్ శంషాబాద్ , హైదరాబాద్ లో జరిగిన ఎక్సపో భరత్ కళా పురస్కార్ అవార్డ్స్ – 2026 ను ఖమ్మం రూరల్ మండలం , ఆరెంపుల గ్రామానికి చెందిన శ్రీ మోతుకూరి అశోక్ కుమార్ అందుకున్నారు . ఈ సందర్భంగా వారిని ఎక్సపో భరత్ కళా పురస్కార్ అవార్డ్స్ తో సత్కరించారు .



ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ నాయకులు బంధుమిత్రులు మరియు శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలిపారు . ఇలాంటి అవార్డులను మరెన్నో అందుకోవాలని ఆకాంక్షించారు . గతంలో కూడా పలు జాతీయ స్థాయి ఫోటో వర్కుషాప్ లో

రైస్ మిల్లులో అధికారుల ఆకస్మిక తనిఖీలు

భారీగా ధాన్యం కొరత గుర్తింపు



నిర్మల్ అక్టోబర్ 03 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

భైంసా మండలం వానల్‌పాడు గ్రామంలోని పల్లవి మోడర్న్ రైస్ మిల్లులో శనివారం రెవెన్యూ, పౌర సరఫరాలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మిల్లుకు కేటాయించిన ధాన్యం నిల్వలు, రికార్డుల్లో నమోదైన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మిల్లుకు ప్రభుత్వం కేటాయించిన మొత్తం ధాన్యం 6,102.08 మెట్రిక్ టన్నులు కాగా, లెక్కల ప్రకారం ప్రస్తుతం మిల్లులో 5,904.435 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉండాల్సి ఉంది. అయితే అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించగా కేవలం 79.44 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే లభ్యమైంది. దీంతో మిల్లులో 5,824.995 మెట్రిక్ టన్నుల ధాన్యం కొరత ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ప్రభుత్వ ధాన్యం నిల్వలకు సంబంధించి ఇంత భారీ వ్యత్యాసం గుర్తించడంతో అధికారులు అక్కడికక్కడే పంచనామా నిర్వహించి, ధాన్యం నిల్వలు, రికార్డులకు సంబంధించిన వివరాలను నమోదు చేశారు. ధాన్యం నిల్వల్లో గుర్తించిన భారీ వ్యత్యాసంపై సమగ్ర నివేదికను రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు అధికారులు తెలిపారు. బాధ్యులైన రైస్ మిల్లర్‌పై క్రిమినల్ కేసు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. తనిఖీల సమయంలో రైస్ మిల్లర్ అందుబాటులో లేకపోగా, పరారీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ ధాన్యం అక్రమంగా పక్కదారి పట్టించిన అంశంపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు.

పెద్దపాడులో పెన్షన్ వెరిఫికేషన్

గ్రామ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తాం: అడిషనల్ కలెక్టర్

గద్వాల ప్రతినిధి । అక్టోబర్ 3 । ప్రజా కలం జోగులాంబ గద్వాల జిల్లా పెద్దపాడు గ్రామంలో శుక్రవారం పెన్షన్ లబ్ధిదారుల వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్, ఎంపీడీఓ అధికారులు గ్రామానికి చేరుకుని సర్పంచ్ ఆధ్వర్యంలో పెన్షన్ లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పెన్షన్ లబ్ధిదారుల వివరాలు, అర్హతలను అధికారులు పరిశీలించి వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన సహకారాన్ని అందించేందుకు అధికారులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని అడిషనల్ కలెక్టర్ హామీ ఇచ్చారు. గ్రామంలో అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను అధికారుల దృష్టికి తీసుకువస్తే, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్, ఎంపీడీఓ, సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.



అసంపూర్తి రోడ్డు పనులు వెంటనే పూర్తి చేయాలి

- సంగాపూర్ రింగ్‌రోడ్, క్యాసారం, కోట మైసమ్మ రోడ్లపై అధికారులతో ఎమ్మెల్సీ యాదవరెడ్డి చర్చ

గజ్వేల్: అక్టోబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి):

గజ్వేల్--ప్రజ్ఞాపూర్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న సంగాపూర్ రింగ్‌రోడ్,క్యాసారం,కోట మైసమ్మ రోడ్ల పనులను వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్సీ యాదవరెడ్డి,మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ అధికారులను కోరారు. ఈ మేరకు ఆర్డీవో వి.వి.ఎల్.



చంద్రకళతో పాటు ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులతో వారు ప్రత్యేకంగా చర్చించారు.రింగ్‌రోడ్ పనులు అసంపూర్తిగా ఉండటంతో భారీ వాహనాలు పట్టణం మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయని,ఫలితంగా ట్రాఫిక్ సమస్యలతో పాటు ప్రమాదాల ముప్పు పెరుగుతోందని వారు పేర్కొన్నారు.ప్రజల భద్రత, పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ దృష్ట్యా రింగ్‌రోడ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు.బతుకమ్మ, దసరా పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో పట్టణానికి వచ్చే ప్రజలు, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా క్యాసారం, కోట మైసమ్మ రోడ్ల పనులను కూడా వేగవంతం చేసి పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.పండుగల సమయంలో ట్రాఫిక్ రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలు చేపట్టి, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్‌అండ్‌బీ డిప్యూటీ ఈఈ ఎ.రేణుక,డీఈ నికిత,ఆర్‌అండ్‌బీ శాఖ సిబ్బంది,మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్కర్ పద్మాబాయి నర్సింగ్‌రావు, ఒకటవ వార్డు కౌన్సిలర్ కప్ప మమత పోచయ్య,మాజీ చైర్మన్ రాజమౌళి, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

డబ్బుల పంపిణీ ఆరోపణలపై రెండు పాఠశాలల్లో ఎస్.ఎం.సి. ఎన్నికలు రద్దు

- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప : కలసపాడు మండలంలోని తెల్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొండపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించాల్సిన పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్.ఎం.సి.) ఎన్నికలను వైఎస్సార్ కడప జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ డా. శ్రీధర్ చెరుకూరి రద్దు చేశారు.ఎస్.ఎం.సి. ఎన్నికల నిర్వహణకు సంబంధించి డబ్బుల పంపిణీ జరిగినట్లు వచ్చిన ఆరోపణలను పరిగణనలోకి తీసుకుని ఈ రెండు పాఠశాలల్లో జరగాల్సిన ఎన్నికలను రద్దు చేస్తూ కలెక్టర్ నిర్ణయం తీసుకున్నారు.ఎస్.ఎం.సి. ఎన్నికలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, ఎటువంటి ప్రలోభాలకు తావులేకుండా నిర్వహించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఎన్నికల ప్రక్రియలో డబ్బుల పంపిణీ, ప్రలోభాలు లేదా ఓటర్లను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరిగినట్లు గుర్తించినా, లేదా ఫిర్యాదు అందినా, విచారణ చేపట్టి సంబంధిత ఎన్నికలను రద్దు చేసి, బాధ్యులపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఎస్.ఎం.సి. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఎన్నికల నిర్వహణ అధికారులు, తల్లిదండ్రులు, అభ్యర్థులు సహకరించాలని కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి కోరారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండి
బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలి

తుడా చైర్మన్ డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

తిరుపతి : యువత మత్తు పదార్థాలు, వ్యసనాలకు దూరంగా ఉండి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని తుడా చైర్మన్ తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డా. డాలర్స్ దివాకర్ రెడ్డి తిరుపతి శాసనసభ్యులు ఆరణి శ్రీనివాసులు, పిలుపునిచ్చారు. తిరుపతిలో యువతను మాదకద్రవ్యాల మహమ్మారి బారిన పడకుండా చైతన్యప రిచేందుకు ఉద్దేశించిన 'నషా ముక్త్ యువా ఫర్ వికసిత్ భారత్' ప్రత్యేక అవగాహన పోస్టర్‌ను వారు సంయుక్తంగా ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, స్థానిక ప్రముఖులు, యువజన సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక వికాసం, శారీరక దృఢత్వం

జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీలకు కరకంబాడి క్రీడాకారులు ఎంపిక..?

రేణిగుంట : క్రీడలతోనే మానసిక వికాసం, శారీరక దృఢత్వం సాధ్యమవుతాయని శ్రీ లక్ష్మీదేవి స్పోర్ట్స్ అకాడమీ నిర్వాహకులు, పి. డి. చెన్నూరు రెడ్డి కుమార్ పేర్కొన్నారు. తిరుపతి జిల్లా రేణిగుంట మండలం కరకంబాడి గ్రామపంచాయతీలో శ్రీ లక్ష్మీదేవి స్పోర్ట్స్ అకాడమీని చెన్నూరు రెడ్డప్ప స్థాపించారు. తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, ఫిజికల్ డైరెక్టర్ (పి.డి.) గా శిక్షణ పొందిన ఆయన కుమారుడు చెన్నూరు రెడ్డి కుమార్ ప్రస్తుతం అకాడమీ వ్యవహర్తగా బాధ్యతలు నిర్వహిస్తూ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.ఇటీవల జరిగిన జంప్ రోప్ గేమ్స్ రాష్ట్రస్థాయి పోటీలలో అకాడమీ క్రీడాకారులు విశేష ప్రతిభ కనబరిచి విజయం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని నాందేడ్‌లో (అక్టోబర్ 29 - నవంబర్ 01) జరగనున్న జాతీయ స్థాయి పోటీలలో (నేషనల్ మీట్) వీరు పాల్గొననున్నారు. అండర్-12, అండర్-14 విభాగాల్లో పి. చందు, పి. రామ్‌సాయి, కె. మహేష్ బాబు, డి. హిందూమతి, గగదీప ఈ జాతీయ క్రీడలకు ఎంపికైనట్లు నిర్వహకులు తెలిపారు.గ్రామీణ, పట్టణ క్రీడాకారులకు వాలీబాల్, హ్యాండ్‌బాల్, కబడ్డీ, ఖో-ఖో, జంప్ రోప్, అథ్లెటిక్స్‌లో క్రమశిక్షణతో కూడిన శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు చదువుతో పాటు ఏదో ఒక క్రీడలో రాణించడం వారి భవిష్యత్తుకు ఎంతో దోహదపడుతుందని రెడ్డి కుమార్ పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో గెలిచి జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ

హోళగుంద :ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పథకం ద్వారా అవ్వ తాతలు, వికలాంగులు, వితంతువులు,ఒంటరి మహిళలు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ప్రతి నెలా గౌరవప్రదంగా పెన్షన్లు అందిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని ఈబిజీ గోవింద గౌడ అన్నారు. ఆలూరు నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ వైకుంఠం జ్యోతి ఆదేశాల మేరకు పార్టీ నాయకులు కార్యకర్తలతో కలసి ఈర్లకట్ట కాలనీ,బుడగజంగాల కాలనీ పరిసర ప్రాంతాల్లో లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం-ప్రతి ఇంటికీ భరోసా

కేసీఆర్ కోసం మంథని నుంచి గజ్వేల్‌కు పాదయాత్ర

కాంగ్రెస్ సర్కార్‌పై వంటేరు ఫైర్
కేసీఆర్ మళ్లీ సీఎం కావాలంటూ ముగ్గురు యువకుల పాదయాత్ర
పాదయాత్రికులకు శాలువాలతో సన్మానం చేసిన వంటేరు ప్రతాప్‌రెడ్డి



గజ్వేల్: అక్టోబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి):

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తూ మంథని నియోజకవర్గం నుంచి గజ్వేల్ వరకు పాదయాత్ర చేపట్టిన బెన్నీ పాల్, వెంకటేష్, కొండా వెంకటేష్‌లు శనివారం గజ్వేల్‌కు చేరుకున్నారు. గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి వారిని శాలువాలతో సత్కరించి అభినందించారు.ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలతో ప్రజా సమస్యలను పక్కదారి పట్టిస్తూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఆకాంక్షిస్తున్నారని పేర్కొన్నారు.కేసీఆర్ మళ్లీ సీఎం కావాలనే ఆకాంక్షతో మంథని నుంచి గజ్వేల్ వరకు ముగ్గురు యువకులు పాదయాత్ర చేపట్టడం అభినందనీయమని వంటేరు అన్నారు. గ్రామాలు,పట్టణాల్లో ప్రజలు కేసీఆర్ పాలనను గుర్తు చేసుకుంటున్నారని పేర్కొన్నారు.రైతుల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని వంటేరు ఆరోపించారు.గోదావరిలో వరద జలాలు వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదని, మరోవైపు రైతులకు సాగునీరు,విద్యుత్ సక్రమంగా అందక పంటలు ఎండిపోతున్నాయని అన్నారు. విద్యార్థులు,యువత,మహిళలు, వృద్ధులు, రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగానికి సాగునీరు,విద్యుత్ సక్రమంగా అందించి వారి సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు అహ్మద్ వాజిద్ తదితరులు పాల్గొన్నారు.

గులాబీ కోటలను బద్దలు కొడతారా..



కరీంనగర్ : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాజకీయ కంచుకోటగా భావించే సిరిసిల్ల నియోజకవర్గంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన అధికారిక అభివృద్ధి కార్యక్రమాలు, రాజకీయ బహిరంగ సభ మార్పు సంకేతాలు ఇచ్చింది. అధికారంలో ఉన్న పార్టీ నిర్వహించే ఏ సభకైనా యంత్రాంగం, నిధుల అండతో జనాన్ని సమీకరించడం సహజమే అయినప్పటికీ.. సిరిసిల్ల సభకు తరలివచ్చిన జననందోహంలో ఒక ఆర్గానిక్ ఉత్సాహం కొట్టొచ్చినట్లు కనిపించింది. బలవంతపు తరలింపులకు, స్వచ్ఛందంగా తరలివచ్చే ప్రజా స్పందనకు మధ్య ఉండే విభజన రేఖ ఈ సభలో స్పష్టంగా రుజువైంది. కేటీఆర్‌కు ఎదురేలేదని భావించిన స్వంత గడ్డపైనే ఇంతటి భారీ స్థాయిలో కాంగ్రెస్ బలప్రదర్శన విజయవంతం కావడం గులాబీ శిబిరాన్ని ఆత్మరక్షణలోకి నెట్టింది.తెలంగాణ ఉద్యమ కాలం నుంచి సుదీర్ఘంగా ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న కేటీఆర్‌పై స్థానికంగా యాంటీ-ఇన్‌కంబెన్సీ నెమ్మదిగా బలపడుతోందన్న సంకేతాలు చాలాకాలంగా వినిపిస్తున్నాయి. ఉద్యమ సెంటిమెంట్ పూర్తిగా కనుమరుగైపోవడంతో.. ప్రజలు ఇకపై కేవలం భావోద్వేగాల ఆధారంగా కాకుండా, క్షేత్రస్థాయి పాలన, నేత అందుబాటులో ఉండే తీరు, చేనేత-రైతు సంక్షేమ హామీల అమలు ఆధారంగానే తమ రాజకీయ తీర్పులను నిర్ణయించే వాస్తవికతలోకి వచ్చారు. గత పదేళ్లలో ఐటీ హబ్‌లు, హైటెక్ మౌలిక వసతుల పేరిట జరిగిన ప్రచారం క్షేత్రస్థాయి సామాన్యుల జీవితాలను ఎంతవరకు మార్చిందనే ప్రశ్నలు ఇప్పుడు బలంగా వినిపిస్తున్నాయి. ముఖ్యంగా గల్ఫ్ బాధితుల సమస్యలు, నేతన్నల ఆత్మహత్యల నివారణలో గత ప్రభుత్వ వైఫల్యాలు ఇప్పటికీ పచ్చిగానే ఉండటం స్థానిక అసంతృప్తికి ఆజ్యం పోస్తోంది.ఈ ప్రజా వ్యతిరేకత కేవలం అసెంబ్లీ సభతోనే మొదలుకాలేదు. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లోనే దీనికి స్పష్టమైన సంకేతాలు కనిపించాయి. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఉన్న సిరిసిల్ల అసెంబ్లీ సెగ్మెంట్‌లో బీజేపీ ఎంపీ బండి సంజయ్‌కు భారీ మెజారిటీ లభించడం కేటీఆర్ రాజకీయ ఆధిపత్యానికి పడిన మొదటి గట్టి ఎదురుదెబ్బ. బండి సంజయ్‌కు 73 వేల ఓట్లు వస్తే , బీఆర్ఎస్ అభ్యర్థికి 65వేల ఓట్లు మాత్రమే వచ్చాయి. కేటీఆర్ తన సొంత ఇలాకాలోనే ఆధిక్యాన్ని కాపాడుకోలేకపోయారన్న నిజం.. ఓటర్ల మైండ్‌సెట్ మారిపోయిందనడానికి తిరుగులేని ఆధారంగా నిలిచింది. ఒకప్పుడు బీఆర్ఎస్‌కు ఏకపక్ష మద్దతు ఇచ్చిన ఓటర్లు క్రమంగా బీజేపీ వైపు మొగ్గు చూపడం ప్రారంభించగా.. ఇప్పుడు ఆ రాజకీయ శూన్యంలోకి కాంగ్రెస్ వేగంగా చొచ్చుకువెళ్లేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వేస్తున్న ఎత్తుగడలు సిరిసిల్ల రాజకీయాలను మునుపటి కేటీఆర్ వర్సెస్ ఇతరులు స్థాయి నుంచి మార్చి, కాంగ్రెస్ వర్సెస్ బీజేపీ ప్రధాన పోరుగా తీర్చిదిద్దే దిశగా సాగుతున్నాయి. గత లోక్ సభ ఎన్నికల ఫలితాలతో రెండో స్థానానికి వెళ్లిన బీఆర్ఎస్‌ను పూర్తిగా మూడో స్థానానికి పరిమితం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని, సంక్షేమ పథకాలను రేవంత్ సిరిసిల్లాపై కేంద్రీకరిస్తున్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక నిధులు, స్థానిక వర్గాలకు భరోసా ఇస్తూ క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ బలమైన సంస్థాగత పునాదులను ఏర్పాటు చేస్తోంది. ఈ సభ ద్వారా రేవంత్ రెడ్డి వేసిన తొలి అడుగు భవిష్యత్తులో మరింత దూకుడుగా మారనుందని, కేటీఆర్‌ను ఆయన సొంత గడ్డపైనే రాజకీయంగా కట్టడి చేసేందుకు కాంగ్రెస్ దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు వెళ్తోందని స్పష్టమవుతోంది.

ఎక్స్‌ప్రెస్ బస్సుల స్థానంలో డీలక్స్, లగ్జరీలు

ఖమ్మం, వరంగల్, సూర్యాపేట, మరికొన్ని రూట్లలో మార్పు
'మహాలక్ష్మి' వల్లే మార్చారంటూ విమర్శలు - రద్దీకి అనుగుణంగానే మార్పులు: ఎండీ

హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(ఆర్టీసీ) నడుపుతున్న ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసుల రూటు మార్చడం వివాదాస్పదంగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' పథకంలో భాగంగా మహిళా ప్రయాణికులకు ఆర్టీసీ ఆర్డినరీ, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నారు. దీంతో జిల్లాల నుంచి హైదరాబాద్‌కు, హైదరాబాద్ నుంచి వేర్వేరు ప్రాంతాలకు ప్రయాణించే సమయంలో మహిళలు ఎక్స్‌ప్రెస్ బస్సుల్లోనే ఎక్కువగా ప్రయాణిస్తున్నారు. అయితే, కొద్ది రోజులుగా ఖమ్మం, వరంగల్, సూర్యాపేటతోపాటు మరికొన్ని రూట్లలో ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులు తగ్గాయి. అవసరం మేరకు సూపర్‌లగ్జరీ, డీలక్స్ బస్సులను ఆయా రూట్లలో నడుపుతున్నారు. దీంతో ఎక్స్‌ప్రెస్‌లు లేక సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు ఎక్కుతున్న మహిళలు చార్జీలు చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహాలక్ష్మి పథకంలో కోత విధించేందుకు ఆర్టీసీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను తగ్గించారని మహిళా ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తే అధికారులు ఆదాయం కోసం ఎక్స్‌ప్రెస్ సర్వీసులను తగ్గించడమేంటని ప్రశ్నిస్తున్నారు. మరోపక్క, ఎక్స్‌ప్రెస్ బస్సులు అందుబాటులో లేక పురుషులు కూడా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్లో అధిక చార్జీలు చెల్లించి ప్రయాణించాల్సి వస్తుంది. అయితే దసరా పండగకు కొద్ది రోజుల ముందు ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్ని రద్దు చేసి డీలక్స్, సూపర్‌లగ్జరీలు తేవడం 'స్పెషల్' సర్వీసుల పేరుతో పండగ పూట అదనపు చార్జీలు వసూలు చేయడంలో భాగమనే ఆరోపణలు కూడా ఉన్నాయి. పండగ ప్రయాణాల్ని సొమ్ము చేసుకునేందుకే ఆర్టీసీ ఇలా చేస్తోందని విమర్శలూ ఉన్నాయి.

రద్దీకి అనుగుణంగా మార్పు: ఆర్టీసీ ఎండీ

'మహాలక్ష్మి' కారణంగా ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసులను రద్దు చేసినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని ఆర్టీసీ ఎండీ వై. నాగిరెడ్డి స్పష్టం చేశారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా సర్వీసుల్ని నడుపుతుంటామన్నారు. సర్దుబాటులో భాగంగా రద్దీ తక్కువగా ఉన్న మార్గాల్లోని ఎక్స్‌ప్రెస్ బస్సుల్ని రద్దీ ఎక్కువగా ఉన్న రూట్లకు మార్చడం సాధారణ ప్రక్రియన్నారు. పైగా ఎక్స్‌ప్రెస్ స్థానంలో డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను నడపడం సాధ్యం కాదన్నారు.

ఆర్టీసీ కొత్తగా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సుల్ని కొనుగోలు చేయలేదని, అలాంటప్పుడు ఎక్స్‌ప్రెస్‌ల స్థానంలో వాటిని నడపడం సాధ్యం కాదని నాగిరెడ్డి తెలిపారు.

ఓటు హక్కును హరిస్తే సహించేది లేదు

సిరిసిల్ల : ఓటు హక్కును హరిస్తే సహిం చేది లేదని, కేంద్ర ఎన్నికల చీఫ్‌కమిషనర్ జ్ఞానేష్‌కుమార్‌ను బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూషం రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు, బీఎస్పీ రాష్ట్ర నాయకుడు ఎనగందుల వెంకన్నలు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట అఖిల పక్షం ఆధ్వర్యంలో సర్ పేరుతో చేపట్టిన ఓటర్ల తొలగింపును నిలిపివేయాలం టూ నాయకులు ధర్నా చేపట్టారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజా స్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడి ఓటు హక్కును కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి భారతీయ పౌరుడికి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును పరిరక్షించాల్సిన ఎన్నికల సం ఘమే, ఓటర్ల జాబితాల సవరణ పేరుతో ప్రజల్లో ఆందోళన కలిగించే విధంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఓటర్ల సవరణ ప్రక్రియలో దేశవ్యాప్తంగా ము సాయిదా ఓటర్ల జాబితాల నుంచి 13 కోట్లకు పైగా పేర్లు తొలగించినట్లు నివేది కలు వెలువడ్డాయన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా అన్యాయంగా జాబితా నుంచి బయటపడకుండా ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో వ్యవహరించా లని డిమాండ్ చేశారు.సర్ ప్రక్రియలో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగించకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని, తొలగించిన పేర్లకు సంబంధించిన వివరాలను బహిరంగపరచాలని, ఓటరుకు అభ్యంతరాన్ని నమోదు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు.

ఎన్నికల సంఘం నిర్ణయాలపై తలెత్తిన ప్రశ్నలకు సమగ్ర సమాధానాలు ఇవ్వాలన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం చీఫ్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎగమంటి ఎల్లారెడ్డి, జవ్వాజి విమల, జిల్లా కమిటీ సభ్యులు గురజాల శ్రీధర్, సూరం పద్మ, అన్నదాస్ గణేష్, శ్రీరాముల రమేష్ చంద్ర, శ్రీరాం సదానందం, అడెపు రజిత, దశరథం తదితరులు పాల్గొన్నారు.

గ్రేటర్ ఎన్నికలపై ఆచితూచి అడుగులు



హైదరాబాద్ : ఖైరతాబాద్ శాసనసభ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. సుప్రీంకోర్టు తీర్పుతో ఖైరతాబాద్ ఉపఎన్నికల కౌంట్‌డౌన్ ప్రారంభం కాగా, రాజ్యాంగ నిబంధనల ప్రకారం ఆరు నెలల వ్యవధిలోనే ఇక్కడ ఎన్నికలు పూర్తి కావాల్సి ఉంది. అయితే ఖైరతాబాద్‌తో పాటు విస్తృతమైన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ వ్యాప్తంగా స్థానిక సమరానికి ఎందుకు ముహూర్తం ఖరారు కావడం లేదనేది ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాల్లో ఆసక్తికరమైన చర్చగా మారింది. జీహెచ్ఎంసీ పాలక మండలి పదవీకాలం ఫిబ్రవరిలోనే ముగిసినప్పటికీ, ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికల వైపు వేగంగా అడుగులు వేయకపోవడం వెనుక పలు రాజకీయ, పరిపాలనాత్మక కారణాలు ఉన్నాయి.గ్రేటర్ పాలనను మరింత వేగవంతం చేసేందుకు జీహెచ్ఎంసీని మూడు మున్సిపల్ కార్పొరేషన్లు హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరిగా విభజించారు.ఈ విభజన తదుపరి పునర్విభజన , వార్డుల సంఖ్య పెంపు,బీసీ రిజర్వేషన్లపై కోర్టుల్లో నడుస్తున్న వివాదాలు ప్రభుత్వం ముందుకు రాకుండా అడ్డంకిగా మారాయి. ఖైరతాబాద్ ఉపఎన్నిక ఎలాగూ తప్పదు కాబట్టి, అదే ఊపులో గ్రేటర్ ఎన్నికలను కూడా నిర్వహించి ముగించేస్తే ఒక పని అయిపోతుందనే ప్రతిపాదన ఉన్నప్పటికీ, కాంగ్రెస్ నాయకత్వం మాత్రం అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తోంది. నిజానికి గ్రేటర్ పరిధిలో ఇప్పటివరకు జరిగిన రెండు అసెంబ్లీ ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ జయకేతనం ఎగురవేసింది. ఈ వరుస విజయాలు అధికార పార్టీకి మంచి మైలేజ్ ఇచ్చాయనడంలో సందేహం లేదు. అయినప్పటికీ గ్రేటర్ కార్పొరేషన్ స్థానిక పోరు విషయంలో కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ఎందుకు సందేహిస్తోంది? మొదటిది, అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఉపఎన్నికల సరళి వేరు, మున్సిపల్ వార్డు స్థాయి ఎన్నికల సరళి వేరు. కార్పొరేటర్ల స్థాయి పోరులో స్థానిక సమస్యలు, తాగునీరు, డ్రైనేజీ, రహదారులు, మూసీ పునరుజ్జీవన పథకం వల్ల ప్రభావితమైన నిర్వాసితుల అసంతృప్తి నేరుగా ఓటింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది.

ఇటీవల ప్రభు త్వం చేపట్టిన కొన్ని ఆక్రమణల తొల గింపు కార్యక్రమాలు గ్రేటర్ పరిధిలోని మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి వర్గా ల్లో కొంత కలకలం రేపాయి.

ఈ వరిస్థి తుల్లో ముందస్తుగా గ్రేటర్ ఎన్నికలకు వెళ్తే అది ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలకు కలిసివస్తుందేమో ననే భయం కాంగ్రెస్ స్థానిక నేతల్లో ఉందనే ప్రచారం ఉంది.రెండవది, కాంగ్రెస్‌కు హైదరా బాద్ నగర పరిధిలో ఉన్న బలమైన కేడర్ కొరత. గతంలో ఎంఐఎమ్, బీఆర్ఎస్‌లకు గ్రేటర్‌లో పక్కా యం త్రాంగం ఉంది.

ముంబై నవీముంబై భివండి సూరత్ లకు చెందిన ఉద్యమకారులను గుర్తించండి

న్యాయం చేయండి.

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) అక్టోబర్ 03:

ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం తాము పోరాటం చేసిన విషయం జగానికి తెల్సిందే. ఐతే తెలంగాణ ప్రభుత్వం ఉద్యమకారుల పట్ల ఓ కెకె కమిటి (ఉద్యమకారుల గుర్తింపు కమిటీ) ని ఏర్పాటు చేసి, హైద్రాబాద్లో ఉద్యమకారులతో సమావేశం జరిపారు. అందులో వారు దేశంలోని ఉద్యమ ప్రాంతాలైన ముంబై, భివండి, నవీముంబై, సూరత్ తదితర క్షేత్రస్థాయిలోకి వెళ్లి, ఉద్యమకారులతో సమావేశమై వారి అభిప్రాయాల్ని సేకరించి సూచనలు ఇవ్వాలని నిర్ణయిం చుకున్నారు. అందులో భాగంగానే వారు అట్టి ప్రాం తాలకు వెళ్ళాడానికి సిద్ధమ య్యారు. ఐతే కమిటిలోని పెద్దవారు సూచించిన నియమాలు నిబంధనాల విషయాల్ని మేం మావారికి అంద జేశాం. అయితే మొన్న "కమిటి" సభ్యులు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాతో మాట్లాడుతూ "మేము ముంబైకి సెప్టెంబర్ 4న వస్తున్నాం. మీ ఏటిజెఏసీ వారు కూడా రావాలని ఇన్విటేషన్ ఇచ్చారు. ప్రారంభం నుంచి ముంబై భివండి నవీముంబైలో జరిగిన ఉద్యమం పట్ల ప్రతి అంశం విషయాన్ని మేం అక్షర బద్ధం చేస్తూ ఫైలింగ్ చేస్తు వస్తున్నాం. ఐతే మా వద్ద ఉద్యమకారుల మొత్తం ప్రూఫ్స్, గుర్తింపులు, ఆదారాలు బలంగా ఉన్నాయి. దివంగత మన నేత హేమంత్ కుమార్ వద్ద "మొత్తం హార్డ్ డిస్క్", ఎం.మాలజీ వద్ద " 5పెద్ద ఫైల్స్", ద్రవిడ్ మహరాజ్ వద్ద "3పెద్ద ఫైల్స్" ఉన్న విషయం గత నెల గోరేగావ్లో జరిగిన గద్దర్ వర్ధంతి సభలో "కెకె కమిటి" సూచన మేరకు మేం అందరికీ తెలియజేశాం. కావున అందరికి న్యాయం జరగేటట్లు "గుర్తింపు కమిటి"ని కోరాం కోరుతున్నాం. మేం కూడా మీకు సహకరిద్దామంటూ ఎంటిజెఏసి సమన్వయకర్తలు సిర్పా గంగాధర్, కట్ల నర్సింహ, కాసుల నర్సింహ గౌడ్, రసీద్ దూదేకుల లతోసహా ముంబై భివండి నవీముంబై కన్వీనర్స్ తరపున ఈ ప్రకటన చేస్తున్నాం.

రాయితీపై శనగ విత్తనాల పంపిణీ

గజ్వేల్: అక్టోబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి):

రైతులను పప్పుధాన్యాలు, నూనెగింజల సాగు వైపు ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ద్వారా రాయితీపై విత్తనాలను అందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ అధికారి స్వరూపారాణి తెలిపారు. శనివారం సిద్దిపేట జిల్లాలోని 71 రైతు వేదికల్లో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ రైతు వేదికలో ఆమె పాల్గొన్నారు.

ఎంఏఎన్పీ పథకం కింద శనగ విత్తనాలు

మిషన్ ఫర్ ఆత్మనిర్భర్ ఇన్ పల్సెస్ (ఎంఏఎన్పీ) పథకం కింద శనగ విత్తనాలను రైతులకు రాయితీపై పంపిణీ చేశారు. 50 మినీ కిట్లను 100 శాతం రాయితీపై ఉచితంగా, 9.92 క్వింటాళ్ల శనగ విత్తనాలను 70 శాతం రాయితీపై అందించారు.గజ్వేల్, జగదేవ్పూర్,చేర్యాల మండలాలకు 50 మినీ కిట్లు,గజ్వేల్,జగదేవ్పూర్, బెజ్జంకి,చేర్యాల మండలాలకు 44.9 క్వింటాళ్ల శనగ విత్తనాలను 70 శాతం రాయితీపై పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచినట్లు



అధికారులు తెలిపారు.

పొద్దుతిరుగుడు సాగుకు ప్రోత్సాహం

జాతీయ నూనెగింజల మిషన్ యాసంగి సీజన్-2026లో భాగంగా జిల్లాలో నూనెగింజల సాగును ప్రోత్సహించేందుకు 3,000 ఎకరాల్లో పొద్దుతిరుగుడు సాగు కోసం 100 శాతం రాయితీపై ఉచిత విత్తనాలను పంపిణీ చేయనున్నారు.ఇందుకోనం చిన్నకోడూరు,బెజ్జంకి,అక్కన్నపేట, కోహెడ,హుస్నాబాద్,దౌల్తాబాద్, గజ్వేల్,తొగుట,రాయపోల్,సిద్దిపేట రూరల్ మండలాలను ఎంపిక చేశారు.

వేరుశనగ సాగుకు ప్రోత్సాహం

వేరుశనగ సాగును ప్రోత్సహించేందుకు జిల్లాకు 1,250 ఎకరాలకు సరిపడా విత్తనాలను కేటాయించారు. ఇందులో హుస్నాబాద్,కోహెడ,అక్కన్నపేట, బెజ్జంకి మండలాలకు 850 ఎకరాలకు సరిపడా 68 క్వింటాళ్ల విత్తనాలను పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచారు. విత్తనాలు పొందే రైతుల వివరాలను కృషి మ్యాపర్,టీ-సీడ్స్ యాప్లలో ఆన్లైన్లో నమోదు చేయాలని అధికారులు సూచించారు.రైతులకు భూసార పరీక్షలు నిర్వహించడంతో పాటు పంట సాగు అనంతరం ప్రారంభ, మధ్య, కోతకు ముందు దశల్లో క్షేత్రస్థాయిలో పంటను పరిశీలించి, ఫొటోలను కృషి మ్యాపర్ యాప్లో అప్లోడ్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏడీఏ బాబు నాయక్, ఏఓలు నాగరాజు, సర్దార్ ఖాన్, సుకేందర్ రెడ్డి, కొండల్ రెడ్డి, ఆత్మ కమిటీ డైరెక్టర్ మామిడి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు కప్ప భాస్కర్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

గజ్వేల్లో డీడీ కేసులపై కఠిన చర్యలు.. 15 మందికి జైలు

మద్యం తాగి డ్రైవింగ్ చేస్తే జైలుకే.. 15 మందికి శిక్ష

గజ్వేల్: అక్టోబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి):

మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారిపై గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు కఠిన చర్యలు చేపట్టారు. ట్రాఫిక్ పోలీసులు నమోదు చేసిన డ్రంక్ అండ్ డ్రైవ్ (డీడీ),డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన (డబ్ల్యూడీఎల్) కేసులను గజ్వేల్ ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు విచారించి పరిష్కరించింది. మొత్తం 24 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 15 మందికి ఒక రోజు నుంచి ఐదు రోజుల వరకు జైలు శిక్ష విధించింది. మిగిలిన తొమ్మిది డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో ఒక్కొక్కరికి రూ. 10 వేల చొప్పున మొత్తం రూ. 90 వేల జరిమానా విధించారు. అదేవిధంగా మూడు డబ్ల్యూడీఎల్ కేసుల్లో ఒక్కొక్కరికి రూ. 5 వేల చొప్పున మొత్తం రూ. 15 వేల జరిమానా విధించారు.మొత్తంగా 27 కేసులు కోర్టులో పరిష్కారం కాగా,రూ. 1.05 లక్షల జరిమానా విధించడంతో పాటు 15 మందికి జైలు శిక్ష పడింది.మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు హెచ్చరించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని,మద్యం సేవించిన అనంతరం వాహనాలు నడపకుండా రోడ్డు భద్రతకు సహకరించాలని పోలీసులు సూచించారు.





వైద్య సిబ్బందిపై దాడులను ఖండించిన వైద్యుల జేఏసీ

వైద్యులు,వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి

- జిల్లా ఎస్పీకి వినతి పత్రం అందజేసిన జేఏసీ సభ్యులు

యాదాద్రి భువనగిరి జిల్లా, అక్టోబర్ 03(ప్రజా కలం)

ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు, వైద్య సిబ్బందిపై జరుగుతున్న దాడులను వైద్యుల జేఏసీ నాయకులు తీవ్రంగా ఖండించారు.వైద్యులు, సిబ్బందికి విధి నిర్వహణలో పూర్తి భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా వైద్యులు,వైద్య సిబ్బంది ప్రతిరోజూ విధులు నిర్వహిస్తున్నారని,అనేక ప్రతికూల పరిస్థితుల్లోనూ అత్యవసర సేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలను కాపాడేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు.విధి నిర్వహణలో ఉన్న వైద్యులు, సిబ్బందిపై దాడులకు పాల్పడటం ఆందోళనకరమని పేర్కొన్నారు.వైద్య సేవల్లో ఏవైనా సమస్యలు, ఇబ్బందులు తలెత్తినప్పుడు వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాల్సి ఉండగా, దాడులకు పాల్పడటం ఏమాత్రం సమర్థనీయం కాదని స్పష్టం చేశారు.ఇలాంటి ఘటనలు వైద్యులు,సిబ్బంది ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీయడంతో పాటు వైద్య సేవలపై కూడా ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందన్నారు.వైద్యులు ప్రజలకు సేవ చేయడానికి ఆసుపత్రులకు వస్తారు దాడులకు గురికావడానికి కాదు.వైద్యుల భద్రతను కాపాడటం అంటే ప్రజారోగ్య వ్యవస్థను కాపాడటమే అని జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు.వైద్యులు,వైద్య సిబ్బందిపై దాడులు పునరావృతం కాకుండా ప్రభుత్వం,జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సమన్వయంతో పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు. ఆసుపత్రులు,పీహెచ్సీలలో భద్రతను మరింత బలోపేతం చేయడంతో పాటు విధుల్లో ఉన్న వైద్యులు,సిబ్బందికి రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేశారు.వైద్య సేవలపై ప్రజలకు ఏవైనా ఫిర్యాదులు లేదా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులకు తెలియజేసి పరిష్కరించుకోవాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా సంయమనం పాటించాలని జేఏసీ నాయకులు కోరారు. వైద్యులు--ప్రజలు--అధికారుల మధ్య పరస్పర విశ్వాసం, సమన్వయంతోనే మెరుగైన ఆరోగ్య సేవలు అందించగలమని తెలిపారు. వైద్యులు, వైద్య సిబ్బంది ఎలాంటి భయాందోళనలు లేకుండా విధులు నిర్వహించే వాతావరణం కల్పించేందుకు జిల్లా రెవెన్యూ,పోలీస్ శాఖలతో పాటు సంబంధిత అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవాలని జేఏసీ నాయకులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో టి జి ఓ అధ్యక్షులు ఉపేంద్ర రెడ్డి, మెడికల్ ఫోరం అధ్యక్షులు మురళీధర్ రెడ్డి,టీఎన్జీవో అధ్యక్ష కార్యదర్శులు రామ్ రెడ్డి, సత్యనారాయణ,ఐఎన్ టి యు సి అధ్యక్షుడు జమాల్ షరీఫ్ జిల్లాలో పని చేస్తున్న వైద్యులు పారామెడికల్ సిబ్బంది, ఉద్యోగ జేఏసీ నాయకులు, ఉన్నతా అధికారులు తదితరులు పాల్గొన్నారు

నేడే శంషాబాద్లో ఓబీసీ భారీ బహిరంగ సభ

- మహేశ్వరం నుంచి భారీగా తరలిరావాలి

- మండల కాంగ్రెస్ అధ్యక్షులు వట్టేలా మల్లేష్ యాదవ్ పిలుపు



మహేశ్వరం, అక్టోబర్ 03, (ప్రజా కలం)

జాతీయ జనగణనలో ఓబీసీ కులగణన చేపట్టాలనే ప్రధాన డిమాండ్తో శంషాబాద్లో నేడు నిర్వహించనున్న ఓబీసీ భారీ బహిరంగ సభకు మహేశ్వరం మండలం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతి నిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వట్టేలా మల్లేష్ యాదవ్ పిలుపునిచ్చారు. శంషాబాద్లోని గొల్లపల్లి రోడ్డులో ఈరోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభం కానున్న ఈ సభను ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్, టీపీసీసీ ఓబీసీ సెల్ చైర్మన్, షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.సభకు సంబంధించిన ఏర్పాట్లు ఇప్పటికే పూర్తయ్యాయని, పెద్ద సంఖ్యలో ప్రజలు, కాంగ్రెస్ శ్రేణులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.సభ ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పరిశీలించారు. షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, నూతనంగా ఎన్నికైన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డి, మహేశ్వరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వట్టేలా మల్లేష్ యాదవ్, మహేశ్వరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య తదితరులు సభా ప్రాంగణాన్ని పరిశీలించి ఏర్పాట్లను సమీక్షించారు.

మహేశ్వరం నుంచి భారీగా తరలిరావాలి

మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జ్, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు మహేశ్వరం మండలం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో శంషాబాద్కు తరలిరావాలని మల్లేష్ యాదవ్ కోరారు. ఓబీసీతో పాటు ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, యువజన, మహిళా విభాగాల ప్రతినిధులు, ఎన్ఎస్యూఐ, కిసాన్ విభాగాల నాయకులు కూడా సభకు హాజరై విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వెనుకబడిన వర్గాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను గుర్తించేందుకు కులగణన దోహదపడుతుందని, ఈ అంశంపై నిర్వహిస్తున్న సభకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మల్లేష్ యాదవ్ పిలుపునిచ్చారు.

జర్నలిస్టుల హక్కుల సాధన కోసం ప్రభుత్వంతో పోరాడుతాం

టీఎంజేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వత్తుల రఘుపతి

వత్తుల రఘుపతిని ఘనంగా సన్మానించిన

మహేశ్వరం ప్రింట్ ఎలక్ట్రాన్ మీడియా జర్నలిస్టు



మహేశ్వరం, అక్టోబర్ 03 (ప్రజా కలం): తెలంగాణ మాదిగ జర్నలిస్టుల ఫోరం (టీఎంజేఎఫ్) రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా ఇటీవల నియమితులైన వత్తుల రఘుపతిని మహేశ్వరం మండల కేంద్రంలో ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు ఘనంగా సన్మానిం చారు.ఈ సందర్భంగా వత్తుల రఘుపతి మాట్లాడుతూ.. తనను సన్మానించిన మహేశ్వరం మండల మీడియా మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.జర్నలిస్టులు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తూ నిత్యం ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తున్నారని అన్నారు. అలాంటి జర్నలిస్టుల ప్రాథమిక హక్కులు, సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం తగిన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.రాష్ట్రంలో జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన హక్కులు, సదుపాయాలు, సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను సంబంధిత ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. జర్నలిస్టులకు రావాల్సిన హక్కుల సాధన కోసం అవసరమైతే ప్రభుత్వంతో పోరాడైనా సరే వాటిని సాధిస్తానని స్పష్టం చేశారు. జర్నలిస్టులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కుల కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం మండలానికి చెందిన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.



మానసిక ప్రశాంతతతోనే ఒత్తిడిని అధిగమించగలం

'ది అన్చార్టెడ్ ఆర్టరీ' పుస్తకావిష్కరణలో బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి.

రచయిత డాక్టర్ శరత్ రెడ్డికి అభినందనలు తెలిపిన కీర్తిరెడ్డి.

హైద్రాబాద్: అక్టోబర్ 3(ప్రజాకలం న్యూస్)

ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలను అధిగమించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి అన్నారు. శనివారం హైద్రాబాద్ ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ మెడికవర్ ఆస్పత్రిలోని బ్లూ ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ శరత్ రెడ్డి రచించిన 'ది అన్చార్టెడ్ ఆర్టరీ' పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీ రమేష్, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, బీజేపీ సీనియర్ నాయకులు డోకూరి పవన్ కుమార్ రెడ్డి, ప్రముఖ సినీనటుడు రాజా రవీందర్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. 'ది అన్చార్టెడ్ ఆర్టరీ' పుస్తకం డాక్టర్ శరత్ రెడ్డి ఆలోచనా విధానానికి నిదర్శనం అన్నారు. శారీరక ఆరోగ్యంపై అవగాహనతో అంతర్గత ప్రశాంతత, మానసిక సమతుల్యత వైపు ప్రజలను నడిపించే ప్రయత్నం ఈ పుస్తకంలో కనిపిస్తోందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో వేగవంతమైన జీవనశైలి కారణంగా ఒత్తిడి, ఆందోళనలు పెరుగుతున్నాయన్నారు.

అనంతగిరి బస్సు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే అండ..

- క్షతగాత్రుల వైద్యానికి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి రూ.2 లక్షల సాయం..

- మృతులకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.10 లక్షల పరిహారం ప్రభుత్వంతో డిమాండ్

పటాన్చేరు, అక్టోబర్ 3 (ప్రజా కలం) ప్రతినిధి

వికారాబాద్ జిల్లా అనంతగిరి ఘాట్రోడ్డులో ప్రైవేటు బస్సు



అదుపుతప్పి బోల్తాపడిన ఘటనలో పటాన్చేరు మండలం క్యాసారం గ్రామానికి చెందిన ఐదుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. బంధువుల అంత్యక్రియలకు వెళ్తున్న సమయంలో జరిగిన ఈ ప్రమాదంపై ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి (జిఎంఆర్) తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న జిఎంఆర్.. వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరామర్శించారు. అనంతరం ఈషా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్యాసారం గ్రామస్తులను పరామర్శించి, వైద్యులతో వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం ఆసుపత్రికి రూ.2 లక్షలు చెల్లించారు. అవసరమైన వైద్య ఖర్చులను తానే భరిస్తానని బాధిత కుటుంబాలకు హామీ ఇచ్చారు. ప్రమాదానికి కారణమైన వారిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిఎంఆర్ డిమాండ్ చేశారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.10 లక్షల చొప్పున నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు..


సీసీ రోడ్లకు నిధులెప్పుడో?..

కిస్తారెడ్డిపేట్, పటేల్గూడలో

రోడ్ల నిర్మాణానికి శశిధర్ రెడ్డి వినతి..

పటాన్చేరు, అక్టోబర్ 3 (ప్రజా కలం) ప్రతినిధి

అమీన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిస్తారెడ్డిపేట్, పటేల్గూడ తదితర ప్రాంతాల్లో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలని అమీన్పూర్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు శశిధర్ రెడ్డి కోరారు. ఈ మేరకు జోనల్ కమిషనర్కు వినతిపత్రం అందజేశారు. ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత రోడ్లకు త్వరితగతిన అనుమతులు, నిధులు మంజూరు చేయాలని కోరారు. రోడ్ల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలగడంతో పాటు రాకపోకలు సురక్షితంగా సాగుతాయని శశిధర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు శీను, శ్రీనివాస్ గౌడ్, మల్లేష్, సాయిలు, రమేష్, సురేష్ తదితర నాయకులు పాల్గొన్నారు..





శ్రీ వైష్ణవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో

దుర్గాదేవి మండపం కర్ర పూజా

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు.. ఉత్సవాలకు శ్రీకారం

మేడిపల్లి అక్టోబర్ 03(ప్రజాకలం న్యూస్)

దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరిం చుకుని బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీలో శ్రీ వైష్ణవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ దుర్గాదేవి మండపం కర్ర పూజా కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. యూత్ సభ్యులు భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించి, అమ్మవారి ఆశీస్సులు కోరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలను భక్తి,శ్రద్ధలతో నిర్వహిం చేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమం లో కుక్కల చంద్రయ్య, మరాటి మత్స్యగిరి, దయ్యాల అలివేలు, శ్రీ వైష్ణవి యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు కుక్కల రాజు,కుక్కల స్వామి,భిక్షపతి,సాయి కిరణ్,వినోద్, కిరణ్,రాజు యాదవ్,బాలు,చంద్,మరాటి యశ్వంత్,లక్కీ, నాని,మణి,శశి,సాయి కుమార్, నవీన్,సాయి చరణ్,ఓంకార్,మహేష్,ఉపేందర్,కొమురయ్య, రమేష్,మరాటి సాయితేజ, భరత్,కుక్కల రాజమ్మ, అలివేలు,వద్మ,సామ్మక, మాధవి, కళ్యాణి,రాణి,శిరిష,లక్ష్మి,మహిళలు,యూత్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక యువత,భక్తులు, కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

ఆలేరు నియోజవర్గం,అక్టోబర్ 03(ప్రజా కలం)

తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడిగా నిలిచిన దొడ్డి కొమురయ్య గారి త్యాగాలను భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిపేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అన్నారు శనివారం రోజున తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డిని బీర్ల ఐలయ్య మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య గారి స్మృతిని చిరస్థాయిగా నిలిపేలా పలు ముఖ్యమైన అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.వరంగల్‌లోని మామునూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి తెలంగాణ తొలి అమరుడు దొడ్డి కొమురయ్య పేరు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్‌పై దొడ్డి కొమురయ్య గారి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.తెలంగాణలో కురుమ కార్పొరేషన్ ఏర్పాటు చేసి, కురుమ సామాజిక వర్గం అభివృద్ధి, సంక్షేమానికి మరింత ప్రాధాన్యత కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. తెలంగాణ సాయుధ పోరాటంలో తొలి అమరుడిగా నిలిచిన దొడ్డి కొమురయ్య గారి త్యాగాలను భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలిపేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య ముఖ్యమంత్రి ని కోరారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు.

157వ గాంధీ జయంతి ఉత్సవాలు

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరం విద్యార్థులు

మహేశ్వరం, అక్టోబర్ 03 (ప్రజా కలం):

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన 157వ గాంధీ జయంతి ఉత్సవాలు టీపీసీసీ మరియు గాంధీ జ్ఞాన్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఎల్బీ స్టేడియంలో ఘనంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరం విద్యార్థులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహేశ్వరం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సంగి రమేశ్ ఆదేశాల మేరకు, కళాశాల ప్రోగ్రాం అధికారి డాక్టర్ జహీదా బేగం ఆధ్వర్యంలో 125 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు ప్రత్యేకంగా ఖాదీ చీరలు ధరించి చరఖా ప్రదర్శనలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వారి ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పాల్గొన్నారు. 1157 మంది చిన్నారులు గాంధీ వేషధారణలో, 1157 మంది విద్యార్థులు చరఖా ప్రదర్శనలో ప్రత్యేక ఖాదీ చీరలతో పాల్గొనడం విశేషంగా నిలిచింది. వివిధ పాఠశాలలు, డిగ్రీ కళాశాలల నుంచి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పెద్ద ఎత్తున హాజరై గాంధీ జయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.





ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ అందుకున్న షేక్ అబ్దుల్ సమద్

- ఘనంగా సన్మానించిన కరాటే అకాడమీ

హైద్రాబాద్ అక్టోబర్ 3(ప్రజాకలం న్యూస్)

షేక్ అబ్దుల్ సమద్ సిఆర్పీఎఫ్ నేషనల్ పోలీస్ అకాడమీలో దాదాపు 41 సంవత్సరాల పాటు విశిష్ట సేవలు అందించారు. 1985లో కానిస్టేబుల్‌గా తన సేవా ప్రస్థానాన్ని ప్రారంభించిన ఆయన, క్రమశిక్షణ, అంకితభావం కృషితో ఇన్‌స్పెక్టర్, డ్రిల్ ఇన్‌స్ట్రక్టర్ స్థాయికి ఎదిగారు. తన సేవా కాలంలో ఐపిఎస్ ప్రొబేషనరీ ఆఫీసర్స్,డైరెక్ట్‌గా నియమితులైన సబ్-ఇన్‌స్పెక్టర్లు అనేక మంది పోలీసు సిబ్బందికి శిక్షణ అందించారు. పంజాబ్,అస్సాం, జమ్మూ ఉ కాశ్మీర్, త్రిపుర వంటి ప్రాంతాల్లో కూడా ఆయన సేవలు అందించారు. ఫిజికల్ ట్రైనింగ్, డ్రిల్,మార్షల్ ఆర్ట్స్, అన్‌ఆర్మ్డ్ కాంబాట్,సెల్ఫ్ డిఫెన్స్,వెపన్స్ ట్రైనింగ్,కౌంటర్ ఇన్‌సర్జెన్సీ యాంటీ టెర్రరిజం ట్రైనింగ్ వంటి అనేక విభాగాల్లో ఆయనకు విశేష అనుభవం ఉంది. తన విశిష్ట సేవలకు గాను 2010లో ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ మెరిటోరియస్ సర్వీస్ అందుకున్న ఆయన, అనంతరం ప్రెసిడెంట్ పోలీస్ మెడల్ ఫర్ డిస్టింగ్విష్డ్ సర్వీస్ను కూడా అందుకున్నారు. తన సుదీర్ఘ సేవా కాలమంతా ఎటువంటి క్రమశిక్షణా శిక్ష లేకుండా ఆదర్శప్రాయమైన సేవా రికార్డును కొనసాగించడం ఆయన ప్రత్యేకత. జీవిఆర్ కరాటే అకాడమీతో అబ్దుల్ సమద్ కు ప్రత్యేక అనుబంధం ఉంది. 2016లో జీవిఆర్ కరాటే అకాడమీ ద్వారా ఆయన కరాటే బ్లాక్ బెల్ట్ సాధించారు. ఇప్పటికీ అదే ఆసక్తి, క్రమశిక్షణతో కరాటే సాధనను కొనసాగిస్తూ, ఈ సంవత్సరం



తన తదుపరి డాన్ గ్రేడింగ్‌కు సిద్ధమవుతున్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి మహమ్మద్ అలీ రఫత్, సీనియర్ అడ్వకేట్ అశోక్, జీవిఆర్ కరాటే అకాడమీ ఫౌండర్ ఉ డైరెక్టర్ డా.జి. ఎస్. గోపాల్ రెడ్డి పాల్గొని షేక్ అబ్దుల్ సమద్ ని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అబ్దుల్ సమద్ సుదీర్ఘ సేవలు, పోలీసు శిక్షణ రంగానికి ఆయన చేసిన కృషి, క్రమశిక్షణ మార్షల్ ఆర్ట్స్ పట్ల ఆయనకున్న అంకితభావాన్ని ప్రముఖులు అభినందించారు. షేక్ అబ్దుల్ సమద్ కి జీవిఆర్ కరాటే అకాడమీ హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తూ, ఆయన భవిష్యత్తులో కూడా యువతకు తన అనుభవం, జ్ఞానం క్రమశిక్షణతో మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించింది.

భాగ్యరధి డిగ్రీ కళాశాలలో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

- విద్యార్థులు లక్ష్యసాధనతో పాటు సమాజ అభివృద్ధికి తోడ్పడాలి

- హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి.కృష్ణారెడ్డి

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి)

భాగ్యరధి డిగ్రీ కళాశాలలో 2026 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థుల కోసం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ పి. కృష్ణారెడ్డి హాజరయ్యారు. కళాశాల డైరెక్టర్లు కూచిపూడి రామకృష్ణ, నల్ల జైశంకర్ గౌడ్, ప్రిన్సిపాల్ నవీన్ రాజ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ముఖ్య అతిథి ప్రొఫెసర్ డాక్టర్ పి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ...డిగ్రీ పట్టా పొందడం విద్యార్థుల జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి మాత్రమేనని, అసలైన జీవిత ప్రయాణం ఇప్పుడే ప్రారంభమవుతుందన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దానిని సాధించే దిశగా నిరంతరం కృషి చేయాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో జ్ఞానంతో పాటు నైపుణ్యాలు, క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం ఎంతో అవసరమని పేర్కొన్నారు. వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో నేటి యువత, ముఖ్యంగా జెన్-జీ విద్యార్థులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు కేవలం ఉద్యోగాలు సాధించడమే కాకుండా, తమ జ్ఞానం, ప్రతిభను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలన్నారు. సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగి, దేశ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలని సూచించారు. అపజయాలకు భయపడకుండా అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని విద్యార్థులను ప్రోత్సహించారు. కళాశాల డైరెక్టర్ కూచిపూడి రామకృష్ణ మాట్లాడుతూ...ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులు తమ కెరీర్‌ను ప్రణాళికా బద్ధంగా నిర్మించుకోవాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో ఉన్న ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి అవసరమైన నైపుణ్యాలు, పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సివిల్ సర్వీసెస్ పరీక్షల ప్రాధాన్యత, పరీక్షా విధానం, వాటికి సిద్ధమయ్యే విధానం, నిరంతర అధ్యయనం, సమయపాలన, క్రమశిక్షణ వంటి అంశాలను విద్యార్థులకు వివరించారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకు న్నప్పటికీ మానవీయ విలువలను మరచిపోకూడదని, సమాజంలో మంచి వ్యక్తులుగా గుర్తింపు పొందేలా ప్రవర్తించాలని సూచించారు. కష్టపడే తత్వం, నిజాయితీ, అంకితభావంతో ముందుకు సాగితే జీవితంలో నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించవచ్చని పలు ఉదాహరణల ద్వారా వివరించారు. కళాశాల డైరెక్టర్ నల్ల జై శంకర్ గౌడ్ మాట్లాడుతూ... విద్యార్థులు జీవితంలో విజయం సాధించడానికి క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కమ్యూనికేషన్ నైపుణ్యాలతో పాటు ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. మీరు డిగ్రీ పట్టా అందుకుంటున్నారు. భవిష్యత్తులో ఇదే కళాశాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి, మీ విజయగాథను ఇతర విద్యార్థులతో పంచుకునే స్థాయికి ఎదగడం మీ జీవితంలో గొప్ప విజయంగా భావించాలి" అని విద్యార్థులకు సూచించారు. 2026లో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులందరికీ నల్ల జై శంకర్ గౌడ్ అభినందనలు తెలియజేస్తూ, వారు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు, వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహించేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్న ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ను, అధ్యావక అధ్యావకేతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ప్రిన్సిపాల్ నవీన్ రాజ్ మాట్లాడుతూ... విద్యార్థులు కళాశాలల్లో పొందిన విద్య, విలువలు, క్రమశిక్షణను తమతో కలిసి చదువుకున్న స్నేహితులను ఎప్పటికీ మరచిపో కూడదని సూచించారు. ప్రతి విద్యార్థి తన విజయంతో కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

ఈనందర్భంగా 2026 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. విద్యార్థులు తమ అనుభవాలను పంచుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు.గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన కళాశాల యాజమాన్యాన్ని, ప్రిన్సిపాల్ నవీన్ రాజ్‌ను, అధ్యాపక మరియు అధ్యాపకేతర సిబ్బందిని ముఖ్య అతిథులు అభినందించారు. విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించే ఇటువంటి కార్యక్రమాలను భవిష్య త్తులోనూ కొనసా గిస్తామని కళాశాల యాజమాన్యం తెలిపింది. విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని నింపుతూ, ఉన్నత లక్ష్యాల సాధనకు స్ఫూర్తినిచ్చిన ఈ గ్రాడ్యు యేషన్ డే వేడుకలు ఘనంగా ముగిశాయి.



ఆర్టీసీ ప్రయాణికులకు ఆన్ లైన్ సౌకర్యం--కే. సురేష్ కుమార్, యాదగిరిగుట్ట డిపో మేనేజర్

యాదగిరిగుట్ట,అక్టోబర్ 03 (ప్రజా కలం)

యాదగిరిగుట్ట నుండి దూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణికుల కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆన్ లైన్ లో టికెట్లు బుక్ చేసుకునే సదుపాయాన్ని కల్పించినట్లు యాదగిరిగుట్ట డిపో మేనేజర్ కే. సురేష్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా డిపో మేనేజర్ కే. సురేష్ కుమార్ మాట్లాడుతూ యాదగిరిగుట్ట నుండి శ్రీశైలం వరకు డీలక్స్ బస్సులు నడుపుతున్నామని ఆయన అన్నారు. ప్రతి రోజూ ఉదయం 6.00 గంటలకు యాదగిరిగుట్ట డిపో నుండి బయలుదేరి, 06.20 నిముషాలకు భువనగిరి, 06.45 నిముషాలకు ఘటకేసర్, 07.15 నిముషాలకు ఉప్పల్/నల్లచెరువు ద్వారా మహాత్మా గాంధీ బస్ స్టేషన్ ద్వారా శ్రీశైలం వెళుతుందని ఆయన అన్నారు.





తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ
యాదగిరిగుట్ట డిపో

యాదగిరిగుట్ట, భువనగిరి, ఘట్కేసర్ పట్టణ మరియు పరిసర గ్రామ ప్రజలకు తెలియజేయునది

ప్రయాణికుల సౌకర్యార్థం యాదగిరిగుట్ట డిపో నుండి ప్రతిరోజూ శ్రీశైలం, రాయచూర్ కు బస్సులు నడుపుచున్నాము. ఇట్టి సర్వీసులకు TGSRTCBUS.IN లో రిజర్వేషన్ సౌకర్యం కల్పించబడినది మరియు యాదగిరిగుట్ట, రాయగిరి, భువనగిరి, ఘట్కేసర్, ఉప్పల్ నల్లచెరువు వద్ద ప్రయాణికులు బస్సు ఎక్కుటకు అవకాశం కల్పించబడినది.

యాదగిరిగుట్ట నుండి శ్రీశైలం

యాదగిరిగుట్ట నుండి శ్రీశైలం					శ్రీశైలం నుండి యాదగిరిగుట్ట	
Reservation Service Number	యాదగిరిగుట్ట నుండి	భువనగిరి నుండి	ఘట్కేసర్ నుండి	ఉప్పల్ నల్లచెరువు నుండి	Reservation Service Number	శ్రీశైలం నుండి
1914	6:00	6:20	6:45	7:15	1915	15:45

యాదగిరిగుట్ట నుండి రాయచూర్

యాదగిరిగుట్ట నుండి రాయచూర్					రాయచూర్ నుండి యాదగిరిగుట్ట	
Reservation Service Number	యాదగిరిగుట్ట నుండి	భువనగిరి నుండి	ఘట్కేసర్ నుండి	ఉప్పల్ నల్లచెరువు నుండి	Reservation Service Number	శ్రీశైలం నుండి
1918	12:30	12:50	13:15	13:45	1919	21:30
1921	15:00	15:20	15:45	16:15	1922	04:00
1930	15:45	16:05	16:30	17:00	1931	04:40
1910	16:30	16:50	17:15	17:45	1911	05:20
1968	17:15	17:35	18:00	18:30	1969	06:00

పెద్దకాకర్లు, శుభకార్యాలకు మరియు టూర్లకు అద్దెకు బస్సులు ఇవ్వబడును.
ఇట్టి అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోగలరు.
-డిపో మేనేజర్, యాదగిరిగుట్ట

ఆర్టీసీ బస్సు సర్వీసు రిజర్వేషన్ నెం.1915 ద్వారా బుక్ చేసుకోవచ్చని ఆయన తెలిపారు. శ్రీశైలం నుండి సాయంత్రం 15.45 నిముషాలకు బయలుదేరి తిరిగి యాదగిరిగుట్ట కు వస్తుందన్నారు.

అదే విధంగా, యాదగిరిగుట్ట నుండి రాయచూర్ కు 12.30, 15.00, 15.45, 16.30 మరియు 17.00 గంటలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు నడుపుతున్నామని ఆయన అన్నారు. ప్రతి డీలక్స్ బస్సు భువనగిరి, ఘట్కేసర్, ఉప్పల్, హైదరాబాద్ (MGBS), మహబూబ్ నగర్, మక్తల్ ద్వారా రాయచూర్ వెళ్లి మరుసటి రోజు యాదగిరిగుట్ట కి వస్తుందన్నారు.ఈ బస్సుల ఆన్ లైన్ రిజర్వేషన్ల కొరకు ఫోన్ నంబర్ 9063404773 ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

హెచ్చరిక బోర్డుల్లేవు

- వాహనదారులకు తిప్పలే

- కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో రెండు

- కిలోమీటర్లు వెళ్లి తిరిగి వస్తున్న వాహనదారులు..

-సొంత ఖర్చుతో సూచిక బోర్డులు ఏర్పాటు చేసిన సామాజిక కార్యకర్త

ప్రజాకలం/ కుత్బుల్లాపూర్ (ప్రతినిధి) రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నా.. వాహనదారులను అప్రమత్తం చేసేందుకు కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సూరారం



ఎక్స్‌రోడ్ నుంచి బౌరంపేట్, శంభీపూర్, ఐడీఏ బొల్లారం, మియాపూర్ వైపు వెళ్లే మార్గంలో సూరారం గ్రామం విశ్వకర్మ కాలనీ ప్రాంతం దాటిన తర్వాత రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. పనులు జరుగుతున్న విషయాన్ని ముందుగానే తెలియజేసే సూచికలు, హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో భారీ వాహనాలతో పాటు చిన్న వాహనాలు సైతం సుమారు రెండు కిలోమీటర్లు వెళ్లి తిరిగి వెనుదిరగాల్సిన పరిస్థితి నెలకొంది. వాహనదారుల ఇబ్బందులను గమనించిన మాజీ లారీ యజమాని, నార్త్ రన్ సిటీ ఇసుక లారీల సంఘం మాజీ కార్యదర్శి, సామాజిక--పర్యావరణ కార్యకర్త రవీందర్ ముదిరాజ్ స్పందించారు. అధికారుల కోసం ఎదురుచూడకుండా తన సొంత ఖర్చుతో మూడు సూచిక బ్యానర్లు ఏర్పాటు చేసి వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గాన్ని సూచించారు.సూరారం చౌరస్తా నుంచి కట్టమైసమ్మ ఆలయం--బహదూర్పల్లి ఎక్స్‌రోడ్ చౌరస్తా వరకు వెళ్లి ఎడమవైపు తిరిగి బౌరంపేట్, ఐడీఏ బొల్లారం, బాచుపల్లి వైపు వెళ్లాలని వాహనదారులకు సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో నాగేందర్, బాబు, నవీన్‌కుమార్,కార్తీక్, రాకేష్, సాయి తదితరులు పాల్గొన్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యానికి తాము ఇబ్బంది పడుతున్నా ప్రజల భద్రత కోసం స్వచ్ఛందంగా ముందుకొచ్చి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంపై స్థానికులు, వాహనదారులు రవీందర్ ముదిరాజ్‌ను అభినందించారు. ఇలాంటి బాధ్యతా కల్గిన వ్యక్తులు ఉన్నంత కాలం ప్రజా ప్రయోజనం, న్యాయం బతికే ఉంటాయంటూ ఆయన సేవలను కొనియాడారు.

రైతులకు 24 గంటల కరెంట్ అందించడంలో

కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

- మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి

భూదాన్ పోచంపల్లి అక్టోబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి)

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తుందని పోచంపల్లి మండల మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి అన్నారు. శనివారం భూదాన్ పోచంపల్లి మండల కేంద్రంలో రైతులకు నాణ్యమైన కరెంటు అందించాలని బిఆర్ఎస్ మండల పార్టీ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ ముట్టడి



కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి హాజరై బిఆర్ఎస్ శ్రేణులతో కలిసి రోడ్డుపై రాస్తారోక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 24 గంటల కరెంటు ఉచితంగా రైతులకు అందించిన ఘనత కెసిఆర్ దే . రేవంత్ రెడ్డి నేడు రైతులకు కనీసం 10గంటల కరెంటు కూడా అందించకుండా రైతులను గో సపెడుతుంది కాంగ్రెస్ ప్రభుత్వంని విమర్శించారు .ఈ సందర్భంగా భారీ సంఖ్యలో బిఆర్ఎస్ శ్రేణులు ఈ కార్యక్రమంలో పాల్గొని సుమారు గంటన్నర సేపు రాస్తారోక కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న చూపు చూస్తే సహించేదే లేదని ఘాటుగా విమర్శించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పార్టీ సుధాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షురాలు బత్తుల మాధవి శ్రీశైలం గౌడ్, ధర్మారెడ్డి పల్లి సర్పంచ్ సామ రవీందర్ రెడ్డి, గౌస్ కొండ ఉప సర్పంచ్ వాకిటి బాల్ రెడ్డి,నాయకులు కందాడి భూపాల్ రెడ్డి, రావుల శేఖర్ రెడ్డి, ముత్యాల మహిపాల్ రెడ్డి, పకీరు సుధాకర్ రెడ్డి,యాకరి నర్సింగరావు, గునిగంటి మల్లేష్ గౌడ్,కే మహేష్ గౌడ్,చేరాల నరసింహ, తంగేలా దశరత,తదితరులు పాల్గొన్నారు.

బక్కని రవిని ఎమ్మార్పీఎస్ నుంచి సస్పెండ్

బీఆర్ఎస్‌లో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని ఆరోపణ



మహేశ్వరం, అక్టోబరు 3 (ప్రజా కలం): కల్వకోల్‌కు చెందిన ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధికార ప్రతినిధి బక్కని రవి మాదిగను సంస్థ నుంచి సస్పెండ్ చేసినట్లు ఎమ్మార్పీఎస్ నాయకులు ప్రకటించారు. సంస్థ నాయకత్వానికి ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా బీఆర్ఎస్‌లో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారన్న ఆరోపణలతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బక్కని రవి పుట్టినరోజు సందర్భంగా అక్టోబరు 1న మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరేందుకు ఏర్పాట్లు చేసుకున్నారని ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు రావుగళ్ల బాబు, సీనియర్ నాయకులు ఎర్ర కృష్ణ మాదిగ, మాజీ మండల అధ్యక్షుడు జంగయ్య మాదిగ తదితరులు తెలిపారు. సంస్థ క్రమశిక్షణకు విరుద్ధంగా వ్యవహరించినందుకే సస్పెన్షన్ వేటు వేసినట్లు శనివారం మహేశ్వరంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

పేరు, జెండా వినియోగిస్తే చర్యలు

ఇకపై బక్కని రవి ఎమ్మార్పీఎస్ పేరు, జెండా, సంస్థ ఎమ్మార్పీఎస్ అధికారిక కార్యక్రమాలుగా పరిగణించబోమన్నారు. వడ్డెమ్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఎమ్మార్పీఎస్ సామాజిక న్యాయం, మాదిగల హక్కులు, ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమాన్ని కొనసాగిస్తోందని నాయకులు తెలిపారు. సంస్థలో కొనసాగుతూ ఇతర రాజకీయ పార్టీలో చేరాలనుకునే వారు ముందుగా నాయకత్వానికి సమాచారం ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు. బక్కని రవి ఇకపై ఎమ్మార్పీఎస్‌లో కొనసాగడం లేదని, ఆయన రాజకీయ నిర్ణయంతో సంస్థకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు.

సమావేశంలో ఎర్ర గణేష్ మాదిగ, ఎర్ర నవీన్‌కుమార్ మాదిగ, మండల అధ్యక్షుడు బొల్లెపాక ప్రభాకర్ మాదిగ, అధికార ప్రతినిధి కొండని కుమార్ మాదిగ, ఉపాధ్యక్షులు భూపతిగారి శేఖర్ మాదిగ, మండ మోహన్ మాదిగ, పెండ్యాల వంశీ మాదిగ, సీనియర్ నాయకుడు అర్జున్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

నేడు శంషాబాద్‌లో

'ఓబీసీ సింహగర్జన'

భారీగా తరలిరావాలి: డీసీసీ అధ్యక్షురాలు పారిజాత నర్సింహారెడ్డి

శంషాబాద్, అక్టోబరు 3 (ప్రజాకలం):

ఓబీసీల హక్కుల సాధన కోసం శంషాబాద్ మండలం గొల్లపల్లిలో శనివారం నిర్వహించనున్న 'ఓబీసీ సింహగర్జన' మహాసభకు భారీ సంఖ్యలో తరలిరావాలని రంగారెడ్డి జిల్లా డీసీసీ అధ్యక్షురాలు చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. అగ్రనేత రాహుల్‌గాంధీ పిలుపు మేరకు పీసీసీ ఓబీసీ ఛైర్మన్,



షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆధ్వర్యంలో ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఓబీసీలకు రాజ్యాంగబద్ధ పదవుల్లో తగిన ప్రాతినిధ్యం, రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో సభ నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. 'జిస్కి జితీ సంఖ్యా--ఉత్నీ హిస్సేదారీ' నినాదాన్ని సాకారం చేసేందుకు ఓబీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రముఖుల హాజరు

గొల్లపల్లిలో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే సభకు ఏఐసీసీ ఓబీసీ ఛైర్మన్ డా. అనిల్ జైహింద్ యాదవ్, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, ఏఐపీసీ ఛైర్మన్ మధు యాష్కీ గౌడ్, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు, ఏఐసీసీ ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోఆర్డినేటర్ కొప్పుల రాజు తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర, జిల్లా స్థాయి కాంగ్రెస్ నాయకులు పాల్గొననున్నట్లు తెలిపారు.

ఐక్యత చాటుదాం

"సామాజిక న్యాయం కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం. ఓబీసీ సోదరులు, యువత, మహిళలు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలివచ్చి 'ఓబీసీ సింహగర్జన' సభను విజయవంతం చేయాలి. ఓబీసీల హక్కుల కోసం ఐక్యతను చాటుదాం" అని పారిజాత నర్సింహారెడ్డి కోరారు.

నిబంధనలకు విరుద్ధంగా 'మెడికల్ షాప్'.. సీజ్!

- పెంకుటింట్లో అర్హత లేని వ్యక్తులతో నిర్వహణ
- గతంలో ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదని ఆరోపణలు
- చివరకు తనిఖీ చేసి చర్యలు తీసుకున్న డ్రగ్ ఇన్‌స్పెక్టర్

నిజామాబాద్, అక్టోబరు 3 (ప్రజాకలం ప్రతినిధి):

నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న ఓ మెడికల్ షాప్‌పై డ్రగ్ కంట్రోల్ అధికారులు చర్యలు చేపట్టారు. భీంగల్ మండలం బడా భీంగల్ గ్రామంలోని సదరు మెడికల్ షాప్‌ను డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి సీజ్ చేశారు. గ్రామంలో ఫార్మసీ అర్హత కలిగిన డి.ఫార్మ్/బి.ఫార్మ్ సిబ్బంది లేకుండానే, అర్హత లేని వ్యక్తులతో ఓ పెంకుటింట్లో మెడికల్ షాప్ నిర్వహిస్తున్నారని గ్రామస్థులు గతంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. దీనికి తోడు షాప్ పక్కనే అర్హత లేని ఆర్ఎంపీ/పీఎంపీ వ్యక్తి వైద్యం చేస్తున్నారంటూ కూడా ఫిర్యాదులు చేసినట్లు సమాచారం.ఇప్పటికే రెండు, మూడు సార్లు తనిఖీలు జరిగినప్పటికీ తగిన చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

దీంతో నిర్వాహకులు నిబంధనలను పట్టించుకోకుండా వ్యాపారం కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో శనివారం డ్రగ్ ఇన్‌స్పెక్టర్ శ్రీలత క్షేత్రస్థాయిలో తనిఖీ నిర్వహించారు.

మెడికల్ షాప్ నిర్వహణలో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించడంతో సదరు షాప్‌ను సీజ్ చేశారు. తదుపరి చట్టపరమైన చర్యల కోసం సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు అధికారులు వెల్లడించినట్లు తెలిసింది. ఇతర షాపులపైనా దృష్టి సారించాలి భీంగల్ మండలంలోని పలు గ్రామాల్లోనూ నిబంధనలకు విరుద్ధంగా మెడికల్ షాపులు నిర్వహిస్తున్నారనే



ఆరోపణలు వినిపిస్తున్నాయి. డ్రగ్ కంట్రోల్ అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

తెలంగాణ రక్షణ సేనలో భారీగా చేరికలు

వర్గల్‌లో వివిధ పార్టీల యువకులు తెలంగాణ రక్షణ సేనలో చేరిక

వర్గల్ మండలానికి చెందిన యువకులకు కండువాలు కప్పి ఆహ్వానించిన కొట్టాల యాదగిరి



గజ్వేల్: అక్టోబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి): తెలంగాణ రక్షణ సేన పార్టీలోకి వివిధ పార్టీలకు చెందిన పలువురు యువకులు చేరారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో తెలంగాణ రక్షణ సేన నియోజకవర్గ ఇన్‌చార్జి కొట్టాల యాదగిరి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో వర్గల్ మండలానికి చెందిన యువకులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

ఈ సందర్భంగా కొట్టాల యాదగిరి మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచేందుకు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఏర్పాటైన తెలంగాణ రక్షణ సేన వైపు ప్రజలు ఆనక్తిగా చూస్తున్నారని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సమస్యల పరిష్కారానికి పార్టీ అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.రాబోయే జెడ్పీటీసీ,ఎంపీటీసీ ఎన్నికల్లో తెలంగాణ రక్షణ సేన పోటీ చేస్తుందని తెలిపారు. పార్టీని గడవగడవకు తీసుకెళ్లి ప్రజల్లో విస్తృతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఎల్ల నర్సింలు,గజ్వేల్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు లింగని రాజు పాల్గొన్నారు.పార్టీలో ప్రశాంత్, నందు, కే.భాను,ఎన్.భాను,ఎస్.భాను,చింటూ, లక్కీ,హర్ష,వేణు,రాము, అఖిల్, వినీల్,అరవింద్ తదితరులు చేరారు.

అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న

- మున్సిపల్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి
- పితృపక్షాల సందర్భంగా అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద అన్నదానం

గజ్వేల్: అక్టోబర్ 3 (ప్రజా కలం ప్రతినిధి):

పితృపక్షాలను పురస్కరించుకుని సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లోని అంగడిపేట ఆంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం మున్సిపల్ మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు, ప్రజలకు అన్నదానం ఏర్పాట్లు చేశారు.మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి,సిద్దిపేట జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.సి.సంతోష్ మాట్లాడుతూ అన్నదానం మహాదానమని, అన్ని దానాల కన్నా అన్నదానానికి విశిష్ట స్థానం ఉందని పేర్కొన్నారు.పితృపక్షాల సందర్భంగా ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించారు.కొమరవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరు సత్యనారాయణ, ఇటిక్యాల మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పితృపక్షాల్లో అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు.దాతల సహకారంతో ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు.పితృపక్షాల్లో అన్నదానం చేస్తే పితృదేవతలకు మోక్షం కలుగుతుందని పురాణాల్లో పేర్కొన్నట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ మాజీ చైర్మన్ రాజమౌళి కుటుంబ సభ్యుల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో అయ్యప్ప ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి అయిత సత్యనారాయణ,అత్తేల్లి లక్ష్మయ్య, దొంతుల సత్యనారాయణ, మల్యాల భద్రయ్య,ఉప్పల కృష్ణమూర్తి, దూబకుంట ప్రభాకర్,కాశీనాథ్,కైలాస ప్రశాంత్,ఉమేష్,గందే సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by **KALAKONDA RAMAKRISHNA**, Printed at **TEJOMAI PUBLICATION**, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: **KALAKONDA RAMAKRISHNA**, **PRGI.No. TELTEL/2010/33275,** Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com